
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు జిల్లా వార్తలు 5

ఆదివారం 29 జూన్ 2025

ఆ ఇద్దరు..!

- ఏడేళ్లుగా చెట్టు కిందే నివాసం
- కుమార్తెతో తల్లి దీనగాథ
- కూతురు చదువు కోసం పరితపిస్తున్న చిన్న రంగమ్మ
- అనాథగా గ్రామ చివరన చెట్టు కిందే నివాసం
- దీనస్థితిలో తల్లీ కూతురు

మంత్రాలయం, (ఆంధ్రజ్యోతి)



చిన్నరంగమ్మ.. యాభై ఏళ్ల వితంతు మహిళ. ఉన్న ఒక్కగానొక్క కుమార్తె కీర్తిబాయిని సంరక్షించుకుంటూ ఓ గోడ చాటున జీవనం సాగిస్తోంది. ప్రతినెలా వచ్చే రూ.4వేలు వితంతు పింఛన్‌తో తనతో పాటు కుమార్తె కడుపు నింపుకుంటోంది. పనిచేసే సత్తువ లేదు. పోనీ ఉందామంటే సెంటు జాగా లేదు. ఇన్నాళ్లూ కుమార్తెను హాస్టళ్లలో ఉంచి చదివించిన ఆమెకు ఇప్పుడు పెద్ద కష్టం వచ్చిపడింది. వయసుకొచ్చిన బిడ్డ ఇప్పుడు తనతో పాటు దయనీయ జీవితం గడపాల్సి వస్తోందంటూ కన్నీరు సుడులు తిరుగుతుండగా ఆమె చెప్పింది.

ఇల్లు లేదు. ఎండ వస్తే చెట్టునీడలో.. వానొస్తే దయతో పక్కింటి వాళ్లు అవకాశం ఇస్తే వారి వసారాలో తలదాచుకోవాల్సిందే. భర్తలేక ఆమె.. తండ్రి లేక యువతి ఒకరినొకరు చూసుకుంటూ గూడు చెదిరిన పక్షుల్లా ఉన్నారు. యుక్త వయస్సులో ఉన్న కీర్తిబాయి, పనిచేసే సత్తువ లేని చిన్నరంగమ్మ ఇద్దరి దీనావస్థను చూస్తే ఎంతటి వారికైనా కన్నీరు రాకమానదు. స్నానం చేయాలంటే ఓ టార్పాల్ పట్టను అడ్డుపెట్టుకోవాలి.. మరుగుదొడ్డికి పోవాలంటే ఊరి బయటకు వెళ్లాల్సిందే. అది చేస్తాం.. ఇది చేశామంటూ గొప్పలు చెప్పే రాజకీయ నేతలు... పేదరికం లేని సమాజమే లక్ష్యం అంటూ ఏసీ గదుల్లో కూర్చొని ప్రకటనలు చేసే అధికారులు... ఓసారి మంత్రాలయం మండలంలోని మాధవరం తండాకు రండి. ఈ గిరిజన బిడ్డల దయనీయ స్థితిని గమనించండి.



తల్లి వంట చేస్తుండగా సామాన్లు శుభ్రం చేస్తున్న కూతురు



కీర్తిబాయి.. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన యువతి. ఈ వయసులో మంచి చదువుతో పాటు స్నేహితులతో సరదాగా ఉండాలని, మంచి డ్రస్సులు వేసుకోవాలని, సంతోషంగా ఉండాలని ఎవరికైనా ఉంటుంది. ఉన్నంతలో సమాజంలో బాగా కనిపించాలనే తపన ఉంటుంది. కానీ ఈ యువతి పరిస్థితి ఇందుకు పూర్తి విభిన్నం. నిలువ నీడ లేదు, వసతి లేదు.. తల్లితో కలసి పడరాని పాట్లు పడుతోంది. పేరులో కీర్తిని దాచుకున్న ఈమెకు నిజ జీవితంలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా పోయాయి.

వివరాలు 6లో

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె ప్రజలకు ఇక్కట్లను తెచ్చి పెట్టింది. ప్రజలు ముఖ్యంగా తాగునీటి కోసం పాట్లు పడుతున్నారు. మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కర్నూలు నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రజలు నీళ్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. నగర పాలక పరిధిలో 1.20 లక్షల నివాసాలు ఉన్నాయి. 52 వార్డుల్లో 6లక్షలకు పైగా జనాభా వుంది. పాత బస్తీలోని అన్ని కాలనీలతో పాటు నగర శివారు కాలనీల్లో సైతం బిందెడు కోసం బోలెడు కష్టాలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. మంత్రి ఇలాకాలో ఇలా జరగడమేమిటని కొందరు విస్తుపోతున్నారు. కాగా ఓ అధికారి కార్మికులను పిలిచి విధుల నుంచి తొలగిస్తామని చెప్పడం నగర పాలక సంస్థలో చర్చనీయాంశమైంది. ఏది ఏమైనా ప్రభుత్వం ప్రజలు నీటి కష్టాలు తీర్చాల్సి ఉంది.

ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న ప్రజలు



- 50 రోజులుగా సమ్మెలో మున్సిపల్ కార్మికులు
- ప్రత్యామ్నాయం అంతంత మాత్రమే
- ఇటీవలే నిరసన తెలిపిన మహిళలు
- బిందెడు నీటి కోసం కష్టాలు
- మంత్రి ఇలాకాలోనే ఎందుకిలా?

తాగునీటి కటకట



కర్నూలు న్యూసిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కర్నూలులో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. నగర జనాభా 6లక్షల పై మాటే.. రోజుకు 87 మిలియన్ లీటర్లు తాగునీరు అవసరం. 48 రోజులుగా నగరపాలక పరిధిలోని ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి కార్మికులు జీతాలు పెంచాలని కోరుతూ సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఎక్కువయ్యాయి. శివారు కాలనీల్లో రోజు విడిచి రోజు నీరు వస్తుంది. సమ్మె నేపథ్యంలో వారం రోజులకు ఒక్కసారి కూడ రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న నగరపాలక పరిధిలో కార్మికులు సమ్మెలోకి వెళ్లడం ఏమిటని మేధావులు ప్రశ్నిస్తున్నారు. శివారు కాలనీలతో పాటు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మూడు రోజుల క్రితం ఉస్మానియా కళాశాల సమీపంలోని లావుబాలిదర్గా వద్ద ఉండే స్థానిక ముస్లిం మహిళలు నెల రోజుల నుంచి తాగునీరు రావడం లేదని నగర పాలక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.



కర్నూలు నియోజకవర్గ పరిధిలోని..

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిదిలోని కొత్తపేట, బంగారుపేట, ఉస్మానియా కళాశాల, ఖండేరి, పెద్దపడఖానా, మాసుంబాష దర్గా, తెలుగువీధి, జోహరాపురం, పింజరి గేరి, గౌలిగేరి, బుధవారపేట, పూలబజార్, మండిబజార్ ప్రాంతాల్లో నీటి కష్టాలు అధికమయ్యాయి. నగర పాలక పరిధిలో 1.20లక్షల నివాసాలు ఉన్నాయి. 52 వార్డుల్లో 6లక్షలకు పైగా జనాభా వుంది. ఇప్పటికే శివారు కాలనీలు గణేష్‌నగర్, ధనలక్ష్మీనగర్, శరీన్‌నగర్, కృష్ణానగర్, లేబర్‌కాలనీలతో పాటు నగరంలో విలీనమైన స్టాంటన్‌పురం, మునగాలపాడు, మామిదాలపాడు, తదితర ప్రాంతాల్లో రెండు రోజులకు ఒక్కసారి కూడా తాగునీరు సరఫరా చేయడం లేదు. అదికూడా ఒక గంటకు మించి ఇవ్వడంలేదు. బిందెడు నీళ్లు దొరికితే చాలు మహాప్రభో.. దాహం తీర్చుకుంటాం అంటూ ఆయా కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, డబ్బున్న బడాబాబులు ఆర్వో ప్లాంట్ నుంచి 20లీటర్ల శుద్ధి చేసిన నీటి ట్యాంక్‌ను రూ.15-20లకు కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు. రెక్కాడితే గాని డొక్క నిండని పేదలు, కూలీలు, కార్మికులు, మధ్యతరగతి నగటు జీవికి కుళాయి నీరే ఆధారం. కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి.

మిగతా 6వ పేజీలో



నేడు వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలకు కౌన్సెలింగ్

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల బదిలీలకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కే. తులసిదేవి శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, ఆడిటోరియం హాలులో బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఈ ఏడాది మే 31వ తేదీ నాటికి ఒకే చోట ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు 570 మంది, ఐదు సంవత్సరాలు పూర్తి కాని వారు 131 మంది బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. స్టేషన్ సీనియారిటీ ఒకేరోజు చేరిన వారికి పోస్టు నియామకం, ర్యాంకును పరిగణనలోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

జిల్లా సహకార అధికారిగా వెంకటకృష్ణ

- నంద్యాలకు రామాంజనేయులు



కర్నూలు అగ్రికల్చర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సహకార శాఖ అధికారిగా కాకినాడలో పని చేస్తున్న వెంకటకృష్ణను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ పని చేస్తున్న రామాంజనేయులును నంద్యాల జిల్లాకు బదిలీ చేసింది. శనివారం కర్నూలు డీసీవో వెంకటకృష్ణుడు విలేకరులతో మాట్లాడుతూ సహకార శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటానని, తమ శాఖ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు జవసత్వాలు కల్పించి నష్టాల బారి నుంచి గట్టెక్కిస్తామని తెలిపారు.

సివిల్ వివాదాల్లో జాగ్రత్తలు పాటించాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి



ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి

కర్నూలు లీగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సివిల్ వివాదాల పరిష్కారంలో తీసుకోవాల్సిన విధి విధానాలపై జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని న్యాయాధికారులకు శనివారం స్థానిక జిల్లా కోర్టులో రెండో జిల్లాస్థాయి వర్క్‌షాపును జ్యోతి ప్రజ్వలనచేసి ఆమె ప్రారంభించారు. సివిల్ ప్రొసిజర్ కోడ్‌లోని సెక్షన్-9, లోక్‌అదాలత్ తీర్పులపై ఒక రోజు వర్క్‌షాపులో ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్ తీర్పులు అమలయ్యేందుకు గట్టిగా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.రాధాకృష్ణ కృపా సాగర్, విశ్రాంత జిల్లా న్యాయాధికారి టి.వేణుగోపాల్‌రావు రిసోర్స్ పర్సన్స్‌గా ఈ విధి విధానాలను వివరించారు. అదనపు జిల్లా, సబ్, జూనియర్ సివిల్ న్యాయాధికారులు పాల్గొన్నారు.

సమస్యలు.. సవాళ్లు! వాడీవేడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం 7లో

కౌన్సెలింగ్‌లో ఉద్యోగుల ఆందోళన

కర్నూలు న్యూసిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలకు సంబంధించి సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్‌లో ఆందోళన చోటు చేసుకుంది. శనివారం ఎస్బీఐ కాలనీలో జరిగిన కౌన్సెలింగ్‌కు కర్నూలు నగర పాలకతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు, బేతంచెర్ల మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీకి సంబంధించిన ఉద్యోగులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. కౌన్సెలింగ్ పారదర్శంగా జరపకుండా అధికారులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు ఆప్షన్‌ను ఇచ్చి వెళ్లిపోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడం ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చిన వారిని అస్సలు పట్టించుకోవడం లేదని, మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి వచ్చిన సిఫారసులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. బదిలీలు పారదర్శకంగా జరగకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఆ ఇద్దరు..!



ఇక్కడే చిన్నరంగమ్మ, కీర్తిబాయి ఉండేది...

మంత్రాలయం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గూడు చెదిరిన గువ్వలుగా మారారు ఆ తల్లీ కూతుళ్లు. ఐదేళ్లుగా బండలచాటున వండాల్సిందే.. చెట్టుకింద ఉండాల్సిందే. ఎవరో పెడితే గానీ కడుపు నిండదు. లేకపోతే పస్తులుండాల్సిందే. చదువుకోవాల్సిన కూతురు కూలికి వెళ్లి తల్లిని పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకెళితే.. మంత్రాలయం మండలం మాధవరం తండా 120 ఇళ్లు ఉండే గ్రామం అది. అందులో చిన్న రంగమ్మ (50), ఆమెకు కూతురు సుగాలి కీర్తిబాయి (18)... వీరు చెట్టుకిందనే ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ, చలికి వణుకుతూ నివాసం ఉంటున్నారు. వీరికి ఎటువంటి ఆధారం లేదు. తులసప్ప, కిష్టమ్మల చిన్న కూతురు రంగమ్మ. ఈమెను కర్ణాటకలోని మాన్వితండాలోని గణేష్ అనే వ్యక్తితో వివాహం జరిపించారు. వీరికి కీర్తిబాయి పుట్టింది. వివాహమైన నాలుగేళ్ల తర్వాత భర్త మృతి చెందాడు. దిక్కులేని పరిస్థితుల్లో చంటి బిడ్డను ఒడిలో పెట్టుకుని రంగమ్మ సొంతగ్రామమైన తండాకు వచ్చింది. మూడేళ్ల అనంతరం వయసులో ఉన్న రంగమ్మను ఒంటరిగా ఉంటే బాగుండదని, ఆ గ్రామంలోని బంధువులు, పెద్దలు మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి తండాకు చెందిన చంద్ర నాయక్‌కు ఇచ్చి రెండో వివాహం చేశారు. అయితే రెండేళ్ల కాపురం అనంతరం చంద్రనాయక్ కూడా మృతి చెందాడు. దిక్కుతోచని పరిస్థితుల్లో నాలుగేళ్ల కూతురును తీసుకుని పుట్టినిల్లయిన ఎం.తండాకు వచ్చింది. గ్రామంలో సొంత ఇల్లు లేదు. స్థలం లేదు.. పొలం కూడా లేదు. ఆపన్నహస్తం అందిస్తామన్న బంధువులు కూడా చేరదీయలేదు.

తెల్లవారుజాము స్నానం.. ఎందుకంటే..!

ఉండేందుకు నిలువ నీడ లేని రంగమ్మ, కీర్తిబాయిల కష్టాలు ఒక ఎత్తయితే... వారు స్నానం చేయడం, మరుగుదొడ్డికి వెళ్లాలంటే మాత్రం ఇబ్బందులు తప్పవు. తెల్లవారుజామున ఎవరూ నిద్రలేయకనే బండల చాటున ఓ టార్పాల్ పట్ట అడ్డుగా చుట్టుకుని స్నానం చేయాలి. తర్వాత ఆ టార్పాల్ పట్ట గాలికి కొట్టుకుపోకుండా ఉండేందుకు తీసి మడతపెట్టి జాగ్రత్తపడతారు. ఇక ఇల్లే లేని వారు మరుగుదొడ్డికి మాత్రం ఊరి బయటకు వెళ్లాల్సిందే. అదికూడా ఎవరూ లేని సమయంలో చూసుకుని భయం భయంగానే. వయసులో ఉన్న ఆ యువతి ఇంతగా ఇబ్బందులు పడుతుంటే ఏ ఒక్కరూ జాలిచూపకపోవడం శోచనీయం. చేయి చాచి అడగలేని పరిస్థితి చిన్నరంగమ్మది. పుట్టిన ఊరిలోనే తనలో తాను కుమిలిపోతూ.. కూతురి విద్య దూరం అవుతుందన్న ఆవేదనతో ఎండకు, వానకు చలికి వణుకుతూ అష్టకష్టాలు పడుతున్నది. దాతలు, ప్రభుత్వ ఆపన్నహస్తం కోసం ఆ కుటుంబం ఎదురు చూస్తోంది.



చెట్టు కింద తల్లీ కూతుళ్లు

బీఎస్సీ నర్సింగ్ చేయాలని ఉంది



ఉండడానికి ఇల్లు లేదు. ఇంటి స్థలం, పొలం కూడా లేదు. చెట్టు కిందనే నేను, అమ్మ ఉంటున్నాం. బీఎస్సీ నర్సింగ్ చేయాలని ఉంది. చదువుకునేందుకు కరెంటు కూడా లేదు. ఎండ, వానలు, గాలికి నిరాశ్రయురాలుగా ఉన్నాము. రెండు రోజుల నుంచి రూ.250 పత్తి పొలంలో కలుపు మొక్కలు తీసేందుకు వెళ్తున్నా. పదో తరగతి వరకు మంచి మార్కులు సాధించాను. మాకు ఉండడానికి నివాసం, ప్రస్తుతం కాలం గడిపేందుకు నిత్యావసర సరుకులు దాతలు ఎవరైనా అందజేసి తనకు చదువుకునేందుకు ఆశ్రయం కల్పిస్తే చదువుకుని మా అమ్మను బాగా చూసుకుంటా.

- కీర్తిబాయి

పదిలో ఫస్ట్ క్లాస్.. కానీ..

పుట్టినింటికి వచ్చిన్న రంగమ్మకు ఏమి చేయాలో తెలియని దీనస్థితిలో చెట్ల చాటున, గోడల మాటున జీవనం సాగిస్తూ తన కూతురు కీర్తిబాయిని చదివించాలన్న తపనతో అక్కడే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి వరకు చదివించింది. 5 నుంచి 10వ తరగతి వరకు బనవాసిలోని ఏపీఆర్‌జేసీ గురుకుల పాఠశాలలో చేర్పించింది. అక్కడ పదో తరగతి ప్రథమ శ్రేణిలో 488 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. కీర్తికి చేయూతనిచ్చేవారు లేకపోవడంతో ఒక ఉపాధ్యాయుడి సలహాతో కర్నూలు బీ.క్యాంపులోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో బైపీసీలో ఇంటర్ పూర్తి చేసింది. ఇందులో అన్ని పాసైనప్పటికీ ఫిజిక్స్‌లో మాత్రం ఫెయిలై అమ్మతో పాటు ఉంటోంది. సప్లిమెంటరీలో సైతం రాసినా ఫెయిలైంది. ఒక వైపు మగదిక్కులేక, ఎలాంటి ఆదరణ లేని వారికి సభ్యసమాజంలో ఆదరించాల్సిన చేతులు కరువయ్యాయి. బీఎస్సీ నర్సింగ్ చేయాలన్న సుగాలి కీర్తిబాయి ఆశలు అడియాశలయ్యాయి. ఎన్టీఆర్ భరోసా రూ.4వేల పింఛన్‌తో రంగమ్మ బిడ్డకు పట్టెడన్నం పెడుతోంది. ట్రంకు పెట్టె, బట్టలు, కట్టెల పొయ్యి, రెండు స్టీల్ ప్లేట్లు, వండుకునేందుకు రెండు పాత్రలు, రెండు బిందెలు తప్పా వారివద్ద ఎలాంటి సామాన్లు లేవు.


తుంగభద్ర తీరం

సాహిత్యం



'ఏరా..! చిప్ దొబ్బిందా..?'

- ఆసక్తికరమైన బాలల సస్పెన్స్ నవల
- ప్రముఖ రచయిత పుల్లా రామాంజనేయులు విశిష్ట ప్రయోగం



కర్నూలు కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పిల్లలు ఆసక్తికరంగా చదివే పుస్తకాలు అరుదైపోతున్న తరుణంలో వారిలో కథల పట్ల ఆసక్తి, అభిరుచి, జిజ్ఞాస కలిగించే పుస్తకం 'ఏరా..! చిప్ దొబ్బిందా..?' నవల. ఈ నవలను కర్నూలుకు చెందిన ప్రముఖ బాలల కథా రచయిత, సాహితీ పరిశోధకుడు పుల్లా రామాంజినేయులు రాశారు. వృత్తి రీత్యా స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) అయిన రామాంజినేయులు ప్రవృత్తి రీత్యా రచయిత. జిల్లా తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక ఒరవడి సృష్టించుకున్నారు. గతంలో ఆయన పిల్లల కోసం కథలు రాయడమే కాకుండా, పిల్లల చేత కథలు రాయించి, వాటిని పుస్తకంగా అచ్చువేశారు. జిల్లా సాహితీ ప్రపంచానికి బాల రచయితలను పరిచయం చేసిన ఘనత కూడా ఈయనకు దక్కుతుంది. అలాగే 'తోకలేని పిట్ట' అనే నవలను కేవలం పొడుపు కథలను మాత్రమే ఉపయోగించి ప్రయోగాత్మకంగా రాశారు. సుమారు 300 వరకు పొడుపు కథలతో కూడిన ఈ నవలకు 'అన్వేషిణి' అనే సంస్థ బహుమతి ప్రకటించి, అచ్చు వేయించింది. అలాగే ఒత్తులే లేకుండా బాలల కోసం ఒక నవల రాశారు. ఇది విమర్శకుల చేత ప్రశంసలు అందుకుంది. గతంలో గురజాడ జాతీయ సాహిత్య పురస్కారం అందుకున్న రామాంజనేయులు తన మూడో నవలగా'ఏరా..! చిప్ దొబ్బిందా..?' వెలువరించారు. ఇదొక సైంటిఫిక్ సస్పెన్స్ నవల మాత్రమే కాదు, మానవ సంబంధాలను, నేటి సమాజంలో మరిచిపోతున్న మానవీయ విలువలను గుర్తు చేస్తుంది. అన్నం పెట్టే రైతులు అప్పుల పాలు అవుతున్నా, ఆత్మహత్యలకు పాల్పడుతున్నా వారెందుకు భూమినే నమ్ముకొని జీవిస్తున్నారు..? అందుకు కారణాలు ఏమిటో ఈ నవల చర్చకు పెడుతుంది.

ఈ నవల్లో మురళి అనే తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి రైతు అయిన తన తండ్రిని కోల్పోతాడు. దీంతో ఒంటరిదైన తల్లి కూలీ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటుంది. చదువులో సాధారణ విద్యార్థిగా ఉండే మురళి కొన్నాళ్లు కనిపించకుండా పోయి, తిరిగి వచ్చిన తర్వాత అసాధారణ విద్యార్థిగా మారిపోవడం, చివరికి ఆ విద్యార్థి తన కలను సాకారం చేసుకున్నాడు. ఇదే ఈ నవల ప్రధాన కథాంశం. ఎంచుకున్న ఇతివృత్తం, అందుకు తగ్గట్టుగానే ఆకట్టుకునేలా కథన శైలి, మధ్య మధ్యలో వాట్సాప్‌లో మనం చదివిన కథలతో మానవ సంబంధాలను కాపాడాలనే తాపత్రయం, మొక్కలను పెంచి పర్యావరణ రక్షణ లాంటి సామాజిక అంశాలను స్పృశించడం వంటి ఉత్తమ లక్షణాలు ఈ నవలలో ఉన్నాయి. తరగతిలో ఎప్పుడూ పాఠ్యాంశాలే కాదు...వారిలో అంతర్లీనంగా ఉన్న సహజ ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలను నిర్వహించాలని కూడా ఈ నవల తెలియ జేస్తుంది. అలాగే హాస్య చతురోక్తులతో నవల సరదాగా నడుస్తుంది. ఆయా ప్రాంతాలు, దేశ నాయకులు, దేవుళ్ల విశేషాలు కూడా నవలలో ఉన్నాయి.

పిల్లలే కాదు, పెద్దలు కూడా చదవాల్సిన మంచి పుస్తకం ఇది. అన్ని పుస్తక విక్రయశాలల్లో అందుబాటులో ఉంది.



- బి. రాణి లీలావతి, కర్నూలు

నేడు 'స్వేచ్ఛ' సాంఘిక నాటిక ప్రదర్శన

శ్రీకృష్ణ రాయబారం (పడక సీను)

కర్నూలు కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నెల నెలా నాటక ప్రదర్శనలు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు హైదరాబాదులోని విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారి 'స్వేచ్ఛ' సాంఘిక నాటిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ దర్శకుడు బీఎం రెడ్డి దర్శకత్వంలో ఈ నాటిక రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించిన ప్రతిచోటా పురస్కారాలు అందుకొని సంచలనం సృష్టించిందని అన్నారు. ఈ నాటికలో 'బలగం' సినిమా ఫేం నటి సురభి లలిత ఒక ముఖ్యపాత్రలో నటిస్తున్నారని తెలిపారు. అలాగే ఈ నాటిక ప్రదర్శనకు ముందు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో, కళాక్షేత్రం కళాకారులతో 'శ్రీకృష్ణ రాయబారం (పడక సీను) సన్నివేశం ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు. ఇందులో శ్రీకృష్ణుడిగా భాస్కర్ యాదవ్, దుర్యోధనుడిగా చల్లా నవీన్‌కుమార్ చౌదరి, అర్జునుడిగా కేవీ రమణ నటిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్ పి. రాజారత్నం, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మియా తెలిపారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

- మతసామరస్యానికి నిదర్శనం
- కులమతాలకతీతంగా నిర్వహణ
- ముస్తాబైన పీర్ల చావిడిలు
- పలు గ్రామాల్లో కొలువుదీరిన పీర్ల స్వాములు



చావిడిలో కొలువుదీరిన పీర్లస్వాములు

కొలిమిగుండ్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా మొహర్రంను నిర్వహిస్తారు. జిల్లాలో పీర్లపండుగ(మొహర్రం) పెద్దఎత్తున ప్రారంభమైంది. కర్బలా మైదానంలో మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమాం హుస్సేన్ బలిదానాన్ని స్మరిస్తూ ముస్లింల్లోని ఓవర్గం మొహర్రంను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం మొదటి మాసాన్ని మొహర్రం నెలగా భావిస్తారు. ఈమాసంలోనే పది రోజులు పవిత్ర దినాలుగా భావిస్తూ మొహర్రం నిర్వహిస్తారు.

హిందూ ముస్లింలు కలిసిమెలిసి..

పూర్వకాలం నుంచి హిందూ ముస్లింలు కులమతాలకతీతంగా జరుపుకునే మొహర్రం పర్వదినానికి గ్రామాల్లో ఎంతో ప్రత్యేకత ఉంది. పట్టణాలు, గ్రామాలు అన్నతేడా లేకుండా వారం రోజుల పాటు హిందూ ముస్లింలు భాయి.. భాయి.. అంటూ మొహర్రం పర్వదినంలో పాల్గొని పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముస్లింలకు సంబంధించిన ఏపర్వదినానికి లేనివిధంగా మొహర్రం (పీర్ల పండుగ)ల్లో హిందువులు పెద్దఎత్తున పాల్గొనడం ప్రత్యేకతగా నిలుస్తుంది. జిల్లాలోని అనేక గ్రామాల్లో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

మొహర్రం చరిత్ర

క్రీ.పూ 650లో మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమాం హుస్సేన్ దేవుడి కోసం యజిద్‌పై పోరాడి అసువులు బాశారు. నాటి నుంచి త్యాగానికి ప్రతీకగా మొహర్రం పర్వదినాన్ని జరుపుకుంటున్నారు. వారు వీరోచితంగా పోరాడి ప్రాణ త్యాగంచేసిన గుర్తుగా, వారిని జ్ఞాపకం చేసుకుంటూ పీర్ల స్వాములను ఊరేగిస్తారు. తెలుగువారు గ్రామీణ ప్రాంతాల్లో ఈపండుగను పీర్లపండుగ అని పిలుస్తారు. పల్లెలతో పాటు, పట్టణాల్లో సైతం పీర్లచావిడిలను అందంగా ముస్తాబు చేస్తారు. తొమ్మిదిరోజుల పాటు పూజలు, ప్రార్థనలు, ఊరేగింపులు నిర్వహిస్తారు. ఈసందర్భంగా ముస్లింలతో పాటు, హిందూ భక్తులు పీర్ల స్వాములకు కపడాలు, పూల దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. పీర్ల స్వాముల ఊరేగింపులో అగ్నిగుండం ప్రవేశం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. పీర్ల స్వాముల నిమజ్జనంతో పీర్ల పండుగ ముగుస్తుంది.

ఎల్లెల్సీకి ముందస్తు సాగునీరు

- ఖరీఫ్‌కు మాత్రమే
- పనులు పూర్తి చేయాలని బోర్డు అధికారుల ఆదేశం



ఉప్పొంగుతున్న తుంగభద్రమ్మ

హాలహర్వి, జూన్28(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నీటి నిల్వ 62 టీఎంసీలు దాటిపోయింది. వరద ఉధృతి 63,816 క్యూసెక్కులు. మరో రెండు రోజుల్లో 80 టీఎంసీలకు నీటి నిల్వ చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జలాశయంలో 80 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకుని, మిగతా వరద నీటిని నదికి విడుదల చేసేందుకు బోర్డు అధికారులు సిద్ధమయ్యారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు ఈ యేడాది మే నెలలోనే ఇన్‌ఫ్లో ప్రారంభం కావడంతో జూన్ ఆఖరికి పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరబోతుంది. కానీ క్రస్ట్‌గేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో జలాశయం నీటి నిల్వ 80 టీఎంసీలకు మించకూడదనే బోర్డు అధికారుల నిర్ణయంతో ఈసారి ముందస్తుగానే కాలువకు నీరు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు కర్ణాటక రాష్ట్ర జలవనరుల మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఏఐసీసీ సమావేశంలో నిర్ణయించారు. కర్నూలు జిల్లాలో 1.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఎల్లెల్సీ కాలువకు ముందస్తుగా సాగునీరు అందుతుంది. ముందస్తుగా సాగునీరు విడుదలవుతున్న నేపథ్యంలో సీసీ లైనింగ్ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లపై బోర్డు అధికారులు ఒత్తిడి పెంచారు. దీంతో పనులు వేగవంతం అవుతున్నాయి. తుంగభద్ర జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు ఉండగా, ప్రస్తుతం 1622 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 63,816 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా అవుట్ ఫ్లో 200 క్యూసెక్కులుగా ఉంది.

తాగునీటికి కటకట

5వ పేజీ తరువాయి

మంత్రి ఇలాకాలో ఇదేమిటని..

తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పట్టారు. ఎలాగైనా సమ్మెను విరమించి విధుల్లోకి చేరాలని నగరపాలక అధికారులు కార్మికులను బెదిరించడంతో పాటు నోటీసులు జారీ చేస్తున్నారు. మంత్రి ఇలాకాలో ఇలా జరగడమేమిటని కొందరు విస్తుపోతున్నారు. మంత్రి చొరవ తీసుకుని సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే అవకాశముంది. రాష్ట్రంలోని 75శాతం నగర పాలక, మున్సిపాలిటీల్లో మాత్రమే కార్మికులు సమ్మెలో ఉన్నారు. మిగిలిన 25శాతం మున్సిపాలిటీల్లో కార్మికులు యథావిధిగా విధులు నిర్వహిస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం, అనంతపురం జిల్లా తాడిపత్రిలో కార్మికులు విధుల్లో కొనసాగుతున్నారు. మంత్రి ఉన్న ప్రాతనిధ్యం వహిస్తున్న కర్నూలు నగర పాలకలో కార్మికులు సమ్మె చేపట్టారు.

ఓ అధికారి బెదిరింపులు

నగర పాలక కార్యాలయంలో ఓ అధికారి కార్మికులను తన చాంబర్‌కు పిలిపించుకుని బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రజలకు సకాలంలో సేవలను అందించడానికి కార్మికులు వెంటనే విధుల్లో చేరాలని, అలా చేరక పోతే కొత్తవ్యక్తులను నియమించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆ అధికారి కార్మికులను హెచ్చరించారు. ప్రజలకు ప్రాథమిక సేవలను అందించడంలో అంతరాయాలను నివారించడానికి గైర్హాజరైన వ్యక్తుల స్థానంలో వారిని అప్కాస్‌లో నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

బోరింగులే దిక్కు..

నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు బోరింగులను ఆశ్రయిస్తున్నారు. మరి కొందరు ప్రైవేటు ట్యాంకర్లను రూ.400 నుంచి రూ.500 వెచ్చించి తెప్పించుకుంటున్నారు. ఈ లెక్కన కార్మికులు సమ్మె విరమించకపోతే ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యే ప్రమాదముంది.

అంతంత మాత్రంగానే..

ప్రత్యామ్నాయ చర్యలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. అశోక్‌నగర్‌లోని నీటి శుద్ధికేంద్రంలో సుమారు 30 నుంచి 40 మంది కార్మికులు పని చేసేవారు. అందరూ సమ్మెలోకి వెళ్లడంతో 12మంది ప్రైవేటు వ్యక్తులతో నీటి శుద్ధి కేంద్రంలో పని చేయిం చుకుంటున్నారు. 52 వార్డులకు 8మంది ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు, 15 మంది మోటార్ ఫిట్టర్లు, 70 మంది కుళాయి టర్న్ కాకర్లు(వీళ్లు నగరంలో ప్రతి వీధిలో వాల్స్ ఓపెన్ అండ్ క్లోజ్ చేసే వాళ్లు). వీరంతా సమ్మెలో ఉన్నారు. దీంతో ప్రత్యామ్యాయంగా ప్రైవేటు వ్యక్తులకు తీసుకుని వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే ఇదంతా చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అరకొరగా ట్యాంకర్లను..

నగరంలోని కొన్నిప్రాంతాలకు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పూర్తిగా తాగునీటి కష్టాలు ఎక్కువగా ఉండే నగరంతో పాటు శివారు కాలనీలకు అరకొరగా ట్యాంకర్లను పంపిస్తున్నారు. ప్రధానంగా ట్యాంకర్ల డ్రైవర్లు కూడా సమ్మెలోకి వెళ్లడంతో ప్రైవేటు వ్యక్తులను వినియోగించుకుంటున్నారు.

విధుల నుంచి తొలగిస్తాం



ప్రజలకు అసౌకర్యం కల్పిస్తే విధుల తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులంతా సమ్మెలో ఉన్నారు. ప్రత్యామ్నాయంగా ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులు, డీఈలు, ఏఈలు, అమ్యూనిటీస్ సెక్రటరీలతో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. లేబర్ పని చేసేందుకు కొందరు ప్రైవేటు వ్యక్తులను రోజువారి కూలీ ఇచ్చి పనులు చేయించు కుంటున్నాం. కార్మికుల డిమాండ్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. కార్మికులు విధుల్లోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- ఎస్.రవీంద్రబాబు, కమిషనర్, కర్నూలు నగరపాలకసంస్థ


గంటల తరబడి ఎదురుచూస్తున్నాం



తాగునీరు ఎప్పుడు వదులుతారో తెలియదు.. ఎంతసేపు వస్తాయో తెలియక గంటల తరబడి ఎదురుచూస్తున్నాం. ఎవ్వరు పట్టించుకోవడం లేదు. ఒక ఇంటికి నీరు వస్తే నాలుగు ఇళ్లకు రావడం లేదు.

- రామమ్మ, కొత్తపేట, కర్నూలు

నెలరోజులుగా తాగునీటి కోసం..



నెల రోజులుగా తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. చివరికి ఇంట్లో పెద్దవాళ్లు పనుల కోసం బయటికి వెళ్లిపోతే ఇంట్లో ఉండే చిన్నారులతో నీటిని తెప్పించుకుంటున్నాం. ముస్లిం మహిళలు బయటికి రాకపోయినా కూడా నీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి వచ్చింది.

సయ్యద్ రహీమున్నీసా, లతీఫ్‌లావుబాలీ దర్గా ప్రాంతవాసి

బోరింగ్ నుంచి తెచ్చుకుంటున్నాం



తాగునీరు సకాలంలో రాకపోవడంతో దూరంలో ఉన్న బోరింగ్ నుంచి తెచ్చుకుం టున్నాం. ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పన్నులు అయితూ వసూలు చేస్తారు. మరి నీరు వదలడంలో మాత్రం ఇబ్బందులు పడుతున్నారు.

- మునెమ్మ, కల్లూరు కాలనీ

నీళ్ల సమస్య లేని కాలనీల్లో కూడా..



నగరంలో ఎప్పుడూ నీళ్ల సమస్య లేని కాలనీల్లో ఇప్పుడే ఎందుకు వచ్చింది. నీళ్ల ట్యాంకు, నగరపాలక సంస్థ కార్యాలయానికి సమీపంలో ఉన్న కాలనీల్లో కూడా తాగునీటి సమస్య వస్తుంది. కొన్ని కాలనీల్లో ఒక ప్రాంతానికి ఎక్కువ ఒక ప్రాంతానికి తక్కువ నీరు సరఫరా అవుతుంది. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు కూడ అందించకపోతే ఎలా?

- ఇరిగినేని పుల్లారెడ్డి, పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు

సమస్యలు.. సవాళ్లు!

- వాడీవేడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం
- వైసీపీ సభ్యులు వర్సెస్ టీడీపీ ప్రతినిధులు
- పలు పథకాలపై రచ్చరచ్చ


కర్నూలు న్యూసిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రతి మూడు నెలలకోసారి జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం గందరగోళంగా మారింది. ఎక్కువసేపు సవాళ్లు విసురుకున్న ప్రజాప్రతినిధులు కాసేపు ప్రజాసమస్యలను ప్రస్తావించారు. అయితే ఒకరిపై ఒకరు దూషణలు చేసుకోవడం, ఆరోపణలు చేసుకోవడానికే అధిక సమయం కేటాయించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన వ్యవసాయం, వైద్య-ఆరోగ్యం, జిల్లా పంచాయితీ శాఖ, విద్యాశాఖల అంశాలపై సర్వసభ్యసమావేశం నిర్వహించారు.



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్



సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు పి.రంజిత్‌భాష, రాజకుమారి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఎమ్మెల్సీ మధుసూదన్, సీఈఓ జి.నాసర రెడ్డి, డిప్యూటి సీఈఓ వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకనే ప్రజలు ఇంటి వద్ద కూర్చోబెట్టారని ఎమ్మెల్యే అన్నారు. దీంతో వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళన చేసి ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో హామీలన్నీ అమలు చేశామని, ప్రస్తుతం ఎలాంటి హామీలు అమలు చేయలేదన్నారు. 'నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని, బహిరంగ చర్చకు సిద్ధమా? బయటకు పోదాం.. దమ్ముంటే బయటకు వచ్చి నా సవాల్‌ను స్వీకరించండి..' అంటూ ఎమ్మెల్యే పార్థసారధి విరుచుకుపడ్డారు. విద్యాహక్కు చట్టం కింద ఉచితంగా సీట్లు ఇవ్వని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన సభ దృష్టికి తెచ్చారు.



డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పించాలి
- మంత్రి టీజీ భరత్

వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని రైతులు వాడుకునేలా అవగాహన కల్పించాలి. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధికారులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. డ్రోన్ స్ప్రేయర్ వల్ల కలిగే ప్రయోజనాలు, లబ్ధి గురించి మండల వ్యవసాయ అధికారుల రైతులకు అవగాహన కల్పించాలి. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం సక్రమంగా అమలయ్యేలా విజిలెన్స్ కమిటీని వేసి పర్యవేక్షించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ అంశంలో లక్షలు, కోట్లు ఖర్చు పెడుతున్నారు. అంత ధర ఉందా వెరిఫై చేయాలి. ఆసుపత్రిల్లో తదితర విభాగాలకు సంబంధించిన ముఖ్యమైన పరికరాలను ఏఎంసీలో కాకుండ సీఎంసీలో తీసుకోవాలి. ఉమ్మడి జిల్లాలో 20 నుంచి 25 సంవత్సరాలు దాటిన పాఠశాల భవనాల స్థితిని తనిఖీ చేయించాలి. హంద్రీ నది మొదటు నుంచి పాతబస్తీ చివర తుంగభద్రలో కలిసే వరకు పూడిక బాగా పెరిగిపోయింది. పూడికతీత తీయాలని ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- అఖిలప్రియ, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే



ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కేసీ కెనాల్‌ను ఆక్రమించుకుని ఎలాంటి అనుమతులు లేకుండ శిల్పా వెంచర్ వేశారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కేసీ కెనాల్‌ను పూర్తిగా పూడ్చేసారు. దీంతో పక్కనే ఉన్న 7 వేల ఎకరాలకు నీరు అందడం లేదు. ఈ విషయంపై మూడు సార్లు అసెంబ్లీలో మాట్లాడాను. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సీఎం కార్యాలయం నుంచి సీరియస్‌గా అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేసులు పెడతారా..లేదా..? ఆక్రమించుకుని వేసి వెంచర్‌లో నష్టపోయిన వారికి కోర్టు ఉత్తర్వుల ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలి. పొగాకును సకాలంలో కొనుగోలు చేయాలి. తల్లికి వందనం సంబంధించి సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలి. బ్యాంకర్లు తల్లికి వందనం డబ్బులు తల్లుల ఖాతాలో పడితే ఇతర అప్పుల కింద జమ చేసుకుంటున్నారు. దీనిపై కలెక్టర్లు స్పష్టమైన ఆదేశాలను బ్యాంకర్లకు ఇవ్వాలి.



ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ... పండ్ల తోటలకు సంబంధించి రైతులకు అవగాహన సక్రమంగా కల్పించడం లేదన్నారు. తాను 30 ఎకరాల్లో పండ్ల తోటలను వేశానని, ఇప్పటి వరకు ఏ అధికారి కూడా రాలేదు అన్నారు.



కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ... జిల్లాలో సాగవుతున్న పండ్ల తోటలను అధికారులు పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. సి. బెళగల్ మండలంలో సీడ్ పత్తి సాగు అంశంపై వెరిఫై చేయాలన్నారు. మెగా డీఎస్సీకి సంబంధించిన పరీక్షలు జూలై 2నాటికి పూర్తయి, జూలై 15 నాటికి ఫలితాలు వస్తాయి. అనంతరం టీచర్ల ఖాళీగా సంబంధించిన సమస్య ఉండదు. జిల్లాలో కొత్తగా ఆరు బీసీ హస్టల్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని, కొత్తగా రెండు హస్టలను ప్రారంభించామన్నారు.



నంద్యాల కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ... నంద్యాల జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదన్నారు. జిల్లాలో ప్రస్తుతం 9,339 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ ఉందన్నారు. రైతులకు ఉచితంగా అందజేయాల్సిన మినీ కిట్లకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ చేయించామని, మినీ కిట్లను అమ్మలేదని విచారణలో తేలిందన్నారు. 3 పొగాకు కంపెనీలతో మాట్లాడి వారితో పొగాకు కొనుగోలు చేయించామన్నారు.

సంతోష్‌నగర్‌లో భారీ చోరీ

కర్నూలు క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సంతోష్ నగర్‌లో ఆషియానా అపార్టుమెంటులో భారీ చోరీ జరిగింది. అఫ్జల్ పర్వేజ్ అనే వ్యక్తి ఇంట్లో సుమారు 18 తులాల బంగారు నగలు, రూ.5 లక్షల నగదు చోరీ చేశారు. వెలుగోడు ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహించే పర్వేజ్ ఈ నెల 24వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాదు వెళ్లారు. శనివారం తిరిగి ఇంటికి వచ్చి చూస్తే తలుపులు తెరిచి వున్నాయి. ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదు చోరీ అయినట్లు గుర్తించారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ విక్రమసింహలు అపార్టుమెంటుకు వెళ్లి పరిశీలించారు. క్లూజ్ టీం వివరాలు సేకరించాయి. బాధుతుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విక్రమసింహ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ... ఒకరి దుర్మరణం

ప్యాపిలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామం సమీపంలో శనివారం చోటు చేసుకుంది. తుగ్గలి మండలం ఎల్లమ్మగుట్ట తండాకు చెందిన కుమార్‌నాయక్(28) బైకుపై పని నిమిత్తం పాణ్యం మండలంలోని నెరవాడ గ్రామానికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి సొంత ఊరికి బయలు దేరాడు. మార్గం మధ్యలోని జలదుర్గం గ్రామం దగ్గరకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో కుమార్‌నాయక్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

ఓర్వకల్లులో బస్సు ఢీకొని...

ఓర్వకల్లు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా మినీ టూరిస్టు బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని జాతీయరహదారి-40పై హుసేనాపురం బస్‌స్టేజీ వద్ద చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఓర్వకల్లు మండలంలోని తిప్పాయపల్లె గ్రామానికి చెందిన బాలస్వామి హుసేనాపురం సమీపంలో శనివారం రోడ్డు దాటుతున్నాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి తిరుపతికి వెళ్తున్న మినీ టూరిస్టు బస్సు ఢీకొనడంతో బాలస్వామి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేశారు. మినీ టూరిస్టు బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సబ్ స్టేషన్ వద్ద ప్రమాదం

- ముగ్గురికి గాయాలు

కోడుమూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం సమీపంలో టెలిగేన్స్ పవర్ కంప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి చెందిన 33 సబ్ స్టేషన్ వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం ఉదయం జరగగా ఆలస్యంగా వెలుగులోకి ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. వివరాలు.. టెలిగేన్స్ పవర్ కంపెనీలో సుమన్ రే, ఇంజనీర్ రవిశంకర్ కుష్వా, జితేంద్ర కన్నోజియా అనే ముగ్గురు నెంబర్-1 ఫిట్టర్ వద్ద తనిఖీ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పత్తికొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణానికి చెందిన ఖాజాహుసేన్ అనే యువకుడు శనివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. వరుసకు అత్తకూతురితో ఖాజాహుసేన్‌కు నిశ్చితార్థం జరిగింది. ఆ తర్వాత రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలు రావడంతో పెళ్లివద్దనుకున్నారు. అయితే అంతకుముందు దిగిన ఫొటోలను ఖాజాహుసేన్ సోషల్‌మీడియాలో పోస్టుచేస్తూ ఇబ్బందులు పెడుతున్నాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనెల 21వతేది పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. కాగా తన బ్యాంకు ఖాతా నుండి తనకు తెలియకుండా డబ్బును డ్రా చేశాడంటూ 26వ తేదీన మరోసారి యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై విచారణకు మరోసారి ఖాజాహుసేన్‌ను పోలీసులు పిలిచారు. తాను డబ్బు డ్రా చేయలేదని ఖాజాహుసేన్ పోలీసులకు విచారణలో చెప్పుకున్నాడు. శనివారం ఖాజాహుసేన్ తిరిగి పోలీసు విచారణకు వెళ్లాల్సి ఉండగా ఉండగా ఇంటి వద్ద విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు కర్నూలులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అమ్మాయి ఫిర్యాదులతో మనస్తాపానికి గురై ఖాజాహుసేన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

చెక్‌పోస్టులో రూ.39 లక్షలు సీజ్



మాధవరం చెక్‌పోస్టులో సీజ్ అయిన డబ్బు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద భారీగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్టు ఎక్సైజ్ ఎస్ఐ రమణారెడ్డి, ఎమ్మిగనూరు ఎక్సైజ్ ఎస్ఐ రాయుడు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆదోనికి చెందిన దుర్గ ఆయిల్ కంపెనీలో గుమస్తాగా పనిచేస్తున్న నాగరాజు కర్ణాటకలోని రాయచూరు నుంచి రూ.39 లక్షల నగదు బ్యాగులో ఉంచుకుని కర్ణాటక బస్సులో ఆదోని వెళ్తున్నాడు. మాధవరం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేసి పట్టుకున్నారు. స్థానిక మాధవరం పోలీస్ స్టేషన్ లో పంచనామా నిర్వహించి పట్టుబడిన నగదుకు ఎలాంటి బిల్లులు, రసీదులు లేకపోవడంతో నగదును సీజ్ చేసి ఆదోని ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు అప్పజెప్పారు.

బదిలీ కావాలా నాయనా..!

బదిలీలలో చేతివాటం ప్రదర్శిస్తున్న సిబ్బంది

కర్నూలు కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బదిలీలు కావాలంటే ఫైసలివ్వాల్సిందే.. ఇదీ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ సిబ్బంది పని తీరు. చేతులు తడిపితే కానీ అక్కడ పనులు జరగని పరిస్థితి. కాని పరిస్థితి ఉంది. ప్రతి పనికి ఒక నిర్ణీత ధరను నిర్దేశించి పనిచేసే వ్యవస్థ అక్కడ పాతుకుపోయి ఉంది. పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై ఫలానా ఉద్యోగిని కలిస్తే వారే మార్గదర్శకత్వం వహిస్తారని ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. చేతులు తడపకుంటే పనులు జాప్యం చేయడం అనే జాఢ్యం ఇక్కడ స్థిరపడి ఉంది. ఇటీవల కొందరు పంచాయతీ కార్యదర్శులు గ్రూప్ 2 పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు. వారి సర్టిఫికేట్ల పరిశీలనకు డీపీవో కార్యాలయం నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం కార్యాలయ సిబ్బంది ఒక్కో పంచాయతీ కార్యదర్శి నుంచి రూ.5వేలు చొప్పున ముక్కు పిండి వసూల్లు చేస్తున్నట్లు సమాచారం. కొందరి నుంచి బలవంతంగా ఫోన్‌పే ద్వారా వసూలు చేసినట్లు తెలిసింది. ఇటీవల గ్రేడ్-4 నుంచి గ్రేడ్-3 పదోన్నతుల అంశంలో కూడా ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శి రూ.10వేల చొప్పున వసూలు చేసి ముడుపులు సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది బదిలీల సందర్భంగా డీపీవో కార్యాలయ సిబ్బంది విపరీతమైన అవినీతికి తెరలేపారు. వారు చేసిన పాపానికి అప్పటి డీపీవో ఇబ్బందులో పడాల్సి వచ్చింది. ఆ సిబ్బందిలో కొందరిని ఆదోని డీఎల్‌పీవో కార్యాలయానికి బదిలీ వేటుపై పంపారు. కర్నూలు డీపీవో కార్యాలయం అవినీతికి కేంద్ర బిందువుగా మారిందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.



డిప్యుటేషన్లకు కేంద్ర బిందువుగా..

ఇప్పటికే డీపీవో కార్యాలయంలో సిబ్బంది ఉండాల్సిన సంఖ్య కన్నా అధికంగా ఉన్నారు. డిప్యూటేషన్ అనే కారణంగా కర్నూలుకు వచ్చి డీపీవో కార్యాలయాన్ని పునరావాస కేంద్రంగా మార్చారు. ఇచ్చిన చోట పని చేయకుండా కేవలం కర్నూలులోనే పని చేస్తామని కొత్త నిబంధన లిఖించుకున్నారు. ఐదేళ్లు కర్నూలు డీపీవో కార్యాలయంలో పని చేయడం, తర్వాత డీఎల్‌పీవో కార్యాలయాలకు బదిలీపై వెళ్లి డిప్యుటేషన్ సాకుతో మళ్లీ కర్నూలులోనే మకాం వేయడం పరిపాటిగా మారింది. సొంత మండలం, సొంత డివిజన్ అనే నిబంధనలు వీరికి వర్తించకపోవం గమనార్హం.

జిల్లా అధికారులు వత్తాసు పలకడం..

గ్రేడ్-2 వీఆర్వోల బదిలీల కోసం శనివారం ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు, రిక్వెస్టు బదిలీలపై వారు మూడు ప్రాంతాలను ఆప్షన్స్ ఎంచుకున్నారు. బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్న ఉద్యోగులు తమ శాఖకు చెందిన మండల స్థాయి అధికారులతో జిల్లా స్థాయి అధికారులతో ముందస్తు సంప్రదింపులు జరపడం గమనార్హం.

ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నాం

ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీలు నిర్వహిస్తున్నాం. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి బదిలీ తప్పనిసరి. డిప్యూటేషన్ల దరఖాస్తులను అనుమతించడం లేదు. ఉద్యోగులను వేధించే ఆఫీసు సిబ్బంది ఎవరైనా ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

● భాస్కర్, డీపీవో, కర్నూలు

రైతులకు రూ.500 కోట్ల రుణాలు

- రుణ బకాయిలు తొందరగా రాబట్టండి
- జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రైతులకు ఈ సంవత్సరం రూ.500 కోట్ల కొత్త రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన సమావేశంలో మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన సింధూర్ డిపాజిట్ పథకం ద్వారా రూ.50 కోట్లను రాబట్టాలని నిర్ణయించామని, దీనికి ప్రతి ఒక్కరూ సపోర్ట్ చేయాలని కోరారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని 99 సహకార సంఘాల్లో కేవలం 19 సహకార సంఘాలు మాత్రమే రుణాలు ఇచ్చేందుకు అర్హత పొందాయని, మిగిలిన సంఘాలు వీలైనంత తొందరలో బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. సహకార కేంద్ర బ్యాంకు, సంఘాలు, సంఘాల్లోని సిబ్బంది ప్రతి ఒక్కరూ బ్యాంకులు, సంఘాలను బలోపేతం చేయడంతో పాటు రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనాలు అందించేందుకు కృషి చేయాలని చైర్మన్ స్పష్టం చేశారు. ఈ సంవత్సరం వ్యాపారాన్ని రూ.4వేల నుంచి రూ.4,500 కోట్లను రాబట్టేందుకు లక్ష్యాన్ని నిర్దేశించామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల డీసీవోలు వెంకటకృష్ణ, రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఆప్కాబ్ ప్రతినిధి దినేష్, జిల్లాలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జీలు, చేనేత సహకార సంఘాల చైర్మన్లు, సిబ్బందితో పాటు డీసీసీబీ జీఎం శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్ నాగిరెడ్డి, ఏజీఎం త్రినాథ్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ఆందోళన

కర్నూలు న్యూసిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ ఆందోళనకరంగా మారింది. శనివారం జడ్పీ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన కౌన్సెలింగ్‌లో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా జరగలేదని సచివాలయ అసిస్టెంట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులపై విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశంచేసి ఉద్యోగులను సముదాయించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు 728మంది ఉండగా.. అందులో 477 మంది ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు, మిగిలిన మెడికల్ గ్రౌండ్స్, స్పౌజ్‌లు ఉన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గొడవ పడుతున్న సందర్భంలో పీఆర్ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి కలగజేసుకుని బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొనడంతో ఉద్యోగులు చల్లబడ్డారు. ఈ క్రమంలో రాత్రి 9 గంటల వరకు ఐదేళ్లు పూర్తిచేసుకున్న వారికి కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మిగిలిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు.

మహిళా పోలీసులకు బదిలీలు

కర్నూలు క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులకు బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులకు బదిలీల ప్రక్రియను చేపట్టారు. ఈ కౌన్సెలింగ్‌కు మొత్తం 839 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నిబంధనల ప్రకారం ర్యాంకింగ్ ప్రకారం పిలిచి పారదర్శకంగా బదిలీలు నిర్వహించారు. బదిలీలు కోరుకునే ఉద్యోగిని గ్రామ వార్డు ఉండే సచివాలయం మినహా ఇతర సచివాలయాలను ఎంపిక చేసుకునే విధంగా, ఖాళీల వారిగా ఉన్న సచివాలయాల ఆప్షన్లను కంప్యూటర్ డిస్‌ప్లే ద్వారా తెరపై చూపించారు. అందులో నచ్చిన సచివాలయాన్ని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. విజువల్ చాలెంజ్ (దృష్టి లోపం, అంధత్వం), మెంటల్లీ డిసేబుల్డ్ (మేధో వైకల్యం), ట్రైబ్స్, దివ్యాంగులు, మెడికల్, స్పౌజ్, జనరల్ తదితరుల సమస్యల ప్రాతిపదికను పరిగణనలోకి తీసుకుని ధృవీకరణ పత్రాలను వైద్యుల పర్యవేక్షణలో నిజ నిర్ధారణ చేసుకుని బదిలీలు చేపట్టారు. అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్స్ ప్రకారం ట్రాన్స్‌ఫర్ ప్రొసీడింగ్స్ విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు అడ్మిన్ హుశేన్ పీరా, ఎస్పీ కృష్ణమోహన్, మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాసాచారి, పోలీస్ వెల్ఫేర్ డా. స్రవంతి తదితరులు ఉన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరుతో మోసం

జూపాడుబంగ్లా, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ సేఫ్టీ ఆఫీసరంటూ ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసి పరారైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. జూపాడుబంగ్లాలో శనివారం ఖాజాహుస్సేన్ అని వ్యక్తి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అని ఐడెంటీకార్డును చూపించి వ్యాపారులను బోల్తా కొట్టించాడు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసరంటూ హోటళ్లు, కిరాణం, కూల్‌డ్రింక్స్ దుకాణాలు తనిఖీలు నిర్వహించాడు. లైసెన్సులు తీసుకోవాలని లేకపోతే దుకాణాలు మూసేయాలని హల్‌చల్ చేశాడు. లైసెన్స్ కోసం ఒక్కో దుకాణానికి రూ.1500 అవుతుందని చెప్పాడు. అడ్వాన్స్‌గా ఒక్కొక్కరి వద్ద రూ.500 తీసుకున్నాడు. ఖలీల్ అనే కూల్‌డ్రింక్ దుకాణదారుడికి అనుమానం వచ్చి నంద్యాల జిల్లా ఫుడ్ ఆఫీసర్ రాముడు కదా అని చెప్పడంతో అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయమై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాముడును వివరణగా కోరగా లైసెన్సులు ఇవ్వాలంటే ముందుగా దుకాణదారులతో సమావేశం నిర్వహించి నిబంధన గురించి అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి వ్యక్తులను వ్యాపారులు నమ్మొద్దని వివరించారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పూర్తయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.నాగస్వామి నాయక్ శనివారం తెలిపారు. గత మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థులు 82.08 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థిని ఉషాబాయి రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డును అందుకుందని తెలిపారు. తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగ్‌లను సంకల్ప్ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.

శకునాలలో దుప్పట్ల పంపిణీ



శకునాలలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న పుల్లయ్య దంపతులు

ఓర్వకల్లు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాల గ్రామంలో శనివారం యోగా గురువు వస్త్రెపల్లి పుల్లయ్య సతీమణి విజయలక్ష్మి ప్రతి ఇంటికి దుప్పట్లు పంపిణీ చేశారు. వారి 42వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో హనుమాన్ చాలీసా, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

నన్నూరు సొసైటీ చైర్మన్‌గా నాగేశ్వరరెడ్డి



ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి కృతజ్ఞతలు
తెలుపుతున్న సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి

ఓర్వకల్లు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు సహకార పరపతి సంఘం చైర్మన్‌గా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాగేశ్వరరెడ్డి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆయనకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వేశ్వరరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, విజయుడు, తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ



మూడు చక్రాల సైకిళ్లు
పంపిణీ చేస్తున్నమల్లెల రాజశేఖర్, జ్యోతి దంపతులు

ఓర్వకల్లు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుసేనాపురం గ్రామంలో దివ్యాంగులకు శనివారం బ్యాటరీలు గల మూడు చక్రాల సైకిళ్లను నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, ఆయన సతీమణి మల్లెల జ్యోతి పంపిణీ చేశారు. నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ సహకారంతో హుసేనాపురం గ్రామానికి చెందిన దివ్యాంగులు నాగన్న, బాలన్న, రామకృష్ణలకు మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు, బజారు, ప్రశాంత్, జయకృష్ణ, నాగరాజు, వెంకటసుబ్బయ్య, వేణు, శంషుద్దీన్, నాగభూషణం శెట్టి, గొల్ల నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగరకార్యదర్శి జి.చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు చాందిని, చౌడేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటిని అరికట్టాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిదిలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో కలుషిత నీరు వస్తుందని, తక్షణమే అరికట్టి ప్రజలకు ఫిల్టర్ నీటిని అందించాలని సీపీఎం మాజీ కార్పొరేటర్ రాముడు డిమాండ్ చేశారు. శనివారం కాలనీల్లో పర్యటించి కలుషిత నీటిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అనేక సార్లు కొళాయిలలో శుద్ధి చేసిన నీటికి బదులుగా కలుషితమైన ఒండ్రు నీరు తరచూ వస్తుందని అన్నారు. అశోక్‌నగర్ నీటి శుద్ధి కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే కాలనీలో ఇలాంటి కలుషితమైన నీరు వస్తే ఇక శివారు కాలనీలో పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే ప్రజలకు ఫిల్టర్ నీటిని అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

బ్రాహ్మణ విద్యార్థుల
ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రతిభావంతులైన బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థులు పది, ఇంటర్‌లలో 90 శాతం పైగా మార్కులు సాధించి ఉండాలని ఆయన సూచించారు. అర్హతగల విద్యార్థులు పురస్కారాలకై నగరంలోని సంకల్‌బాగ్‌లో గల హరిహర క్షేత్రంలో దరఖాస్తులు స్వీకరించి, వాటిని పూర్తిచేసి, మార్కుల జిరాక్స్ ప్రతిని జతచేసి జూలై 3లోగా హరిహర క్షేత్రంలోని మేనేజర్ శివన్నకు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 93936 05937, 97018 67582లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఎర్రమట్టి తరలిస్తే వాహనాలు సీజ్ : ఎస్ఐ

సి. బెళగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే వాహనాలను సీజ్ చేసామని ఎస్ఐ పరమేష్‌నాయక్ ట్రాక్టర్ల యజమానులకు హెచ్చరించారు. శనివారం మండలంలోని చింతమానుపల్లె, సంగాల తిమ్మనదొడ్డి, పలుకుదొడ్డి గ్రామాల్లోని ట్రాక్టర్ల యజమానులతో సమావేశమయ్యారు. ఎస్ఐ గ్రామస్తులతో మాట్లాడుతూ గృహాలు నిర్మించుకునే వారు ఇండ్లు పూడిక చేసుకునేవారు ఎడ్లబండ్ల నుంచి తీసుకోవాలన్నారు. అలాగే కాకుండా రాత్రి సమయాల్లో మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.





వర్షపు నీరు కాదు..
మురుగు నీరే!

కర్నూలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్డుపై చెరువును తలపించేలా చేరిన ఈ నీరు వర్షపు నీరనుకుంటే పొరబట్టే. మురుగునీరు భారీగా రోడ్డుపై చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని అశోక్‌నగర్ - శ్రీనగర్ కాలనీల మధ్య ఉన్న ప్రధాన రోడ్డులో శ్రీవంశీక్రిష్ణ హాస్పిటల్ సర్కిల్‌లో స్థానికులు ముగరు కాలువపై నిర్మాణాలు చేశారు. చెత్తచెదారంతో కాలువ మూసుకుపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపై చేరి చెరువును తలపిస్తుంది. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించే అశోక్‌నగర్, శ్రీనగర్, లేబర్ కాలనీ, వెంకటరమణ కాలనీ, కప్పల నగర్ ప్రాంతాలకు చెందిన వాహనదారులు, ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి ముగురు కాలువలు శుభ్రం చేసి రహదారిపై మురుగు నిల్వ లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అశోక్‌నగర్-శ్రీనగర్ కాలనీ మధ్య ప్రధాన రోడ్డు
వంశీక్రిష్ణ హాస్పిటల్ సర్కిల్‌లో చెరువును తలపిస్తున్న మురుగు

బాలల సంరక్షణకు కృషి చేద్దాం

కర్నూలు కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బాలల సురక్షిత సమాజ నిర్మాణానికి సమష్టి కృషి అవసరమని జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు, చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ కమిటీ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఎస్ఏపీ క్యాంపులోని కేఆర్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి శారద మాట్లాడుతూ బాలల సంరక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత ఎంతో ఉంటుందని చెప్పారు. చిన్నారులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల వ్యక్తిగత భద్రతపై తగిన సూచనలు వారికి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమలో న్యాయవాది శ్రీలక్ష్మి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఉపాధ్యక్షుడు కేడీజీ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులను అవమానిస్తే కేసు కట్టరా...

● జడ్పీ సమావేశం వద్ద ధర్నాకు దిగిన దళిత సంఘాలు



జడ్పీ హాలు వద్ద కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్, దళిత సంఘం నాయకులు

కర్నూలు, జూన్ 28 (ఆంధ్ర జ్యోతి): ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డా.పార్థసారధి, టీడీపీ నాయకురాలు గుడిసె కిష్టమ్మలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు మోపూరు సూర్య, వీరేష్, దేవదాసు, శ్రీలక్ష్మిలు డిమాండ్ చేశారు. శనివారం జడ్పీ సమావేశం హాలు ముందు ధర్నాకు దిగారు. ఎమ్మెల్యే పార్థసారధి, గుడిసె కృష్ణమ్మలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నెల 16న దానాపురంలో పర్యటించిన ఎమ్మెల్యే పార్థసారధి, గుడిసె కిష్టమ్మ బీజేపీ సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానించారని అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ నాయకులు మహేష్, రాముడు, విజయ్, సుదర్శన్, సాయిరామ్, శంకర్, సుజ్ఞానమ్మ, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా
డాక్టర్ కృష్ణ ప్రకాష్



కర్నూలు హాస్పిటల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా రేడియో థెరపి ప్రొఫెసర్ డా.కృష్ణ ప్రకాష్‌ను పునః నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య విద్య పరిధిలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో డా.కృష్ణ ప్రకాష్‌ను లాంగ్ స్టాండింగ్ కింద రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీకి బదిలీ చేశారు. కానీ కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు డైరెక్టర్గా విధులు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కర్నూలుకు రావడానికి ఎవరూ సుముఖంగా లేకపోవడంతో తిరిగి కౌన్సిలింగ్‌లో తీసుకున్న నిర్ణయానికి భిన్నంగా ఉత్తర్వులు జారీ అయినందుకు సవరణ చేశారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమై ఇంకా ప్రాథమిక దశలో ఉన్న నేపథ్యంలో డైరెక్టర్‌గా ఎవరూ లేకపోతే అభివృద్ధి కుంటుపడి ఈ ప్రభావం రోగులు, పీజీ సీట్లపై పడనున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ఈ నెల దిక్కులేని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అన్న శీర్షికను ప్రచురించింది. దీనికి ప్రభుత్వం స్పందించి క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా డా.కృష్ణ ప్రకాష్ ను తిరిగి కర్నూలులోనే నియమించాలని సిఫారసు చేయడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఉలిందకొండ సింగిల్‌విండో చైర్మన్‌గా రమణ



ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని సన్మానిస్తున్న
ఉలిందకొండ సింగిల్‌విండో చైర్మన్ రమణ

కల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం ఉలిందకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సింగిల్‌విండో చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు ఈవీ రమణ నియామకమయ్యారు. ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగిల్‌విండో చైర్మన్ ఎంపికైన ఈవీ.రమణ టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డికి వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈవీ.రమణ మాట్లాడుతూ ఉలిందకొండ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, పక్షపాతం లేకుండా రైతులకు సేవ చేస్తానన్నారు. ఉలిందకొండ సొసైటీ చైర్మన్ నియామకానికి కృషిచేసిన గౌరు దంపతులు, సీఎం చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.

పారదర్శకంగా సచివాలయ కార్యదర్శుల బదిలీలు

● నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జీవోనెం.5 మార్గదర్శకాల ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అర్బన్ సచివాలయాల కార్యదర్శుల బదిలీలు పారదర్శకంగా చేపట్టినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. శనివారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని కౌన్సిల్ హాలులో బదిలీలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో మొత్తం 308 సచివాలయాలు ఉండగా.. 173 అడ్మినిస్ట్రేటివ్, 235 ఎడ్యుకేషన్, 248 వెల్ఫేర్, 208 శానిటేషన్ కార్యదర్శులు ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్నారని అన్నారు. వీరికి ప్రస్తుతం పని చేస్తున్న వారు, వారి సొంత వార్డు మినహా ఇతర వార్డులకు బదిలీలు చేయనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఆదివారం ప్లానింగ్ అమెనిటీస్ కార్యదర్శులు బదిలీలపై కౌన్సెలింగ్ జరగనుందని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌వో జునైద్, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, ఆదోని, నందికొట్కూరు, డోన్, ఎమ్మిగనూరు కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రేడ్-3 ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్

● డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ

కర్నూలు హాస్పిటల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఆదివారం, సోమవారాల్లో జూమ్ ద్వారా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ వెల్లడించారు. సచివాలయ హెల్త్ సెక్రటరీ గ్రేడ్-3 ఏఎన్ఎం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించేందుకు కార్యాలయం ఏవో కే.అరుణ, ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులతో ఏర్పాట్లుపై చర్చించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బదిలీల కౌన్సిలింగ్ ర్యాంకుల ప్రకారం జరుగుతుందని, ఈ బదిలీలు కేవలం గ్రేడ్-3 ఏఎన్ఎంలకు మాత్రమే జరుగుతాయన్నారు. స్పౌజ్ కూడా ప్రభుత్వ ఉద్యోగులకే వర్తిస్తుందని, ప్రైవేటు ఉద్యోగులకు వర్తించదన్నారు. 172పోస్టులు కమిషనర్ ఆదేశాలమేరకు ఎంపీహెచ్ఏ (ఎఫ్) ఉద్యోగులను అక్కడే ఉంచుతామన్నారు.

గ్రేడ్-3 ఏఎన్ఎంల నిరసన

కర్నూలు హాస్పిటల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎం గ్రేడ్-3 వార్డు హెల్త్ సెక్రటరీల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఉద్యోగులు జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సొంత మండలాల్లో పోస్టింగ్‌కు అవకాశం కల్పించాలని కోరారు. బదిలీల కౌన్సెలింగ్ ర్యాంకుల ప్రకారం నిర్వహించాలన్నారు. 2019 అక్టోబరు 3, 4 తేదీల్లో కౌన్సిలింగ్ జరిగిందని, అయితే కొంత మంది ఏఎన్ఎం గ్రేడ్-3లకు 2వ తేదీ విధుల్లో చేరినట్లు చూపించారన్నారు. దీని వల్ల తమకు అన్యాయం జరుగుతుందన్నారు. బదిలీల ప్రక్రియలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, అవినీతి అక్రమాలను అరికట్టాలని కోరారు.

విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించాలి

సి. బెళగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించాలని విద్యుత్ ఏఈ సుకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. వర్షాకాలంలో విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ప్రెస్ క్లబ్‌కు రెండు క్వార్టర్స్‌ను కలెక్టర్ రంజిత్ బాషా కేటాయించడం పట్ల కృతజ్ఞతలు అని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొత్తూరు సత్యనారాయణ గుప్త తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కర్నూలులో ప్రెస్ క్లబ్ లేక జర్నలిస్టులు ఇబ్బంది పడేవారన్నారు. కలెక్టర్ స్పందించి కర్నూలు ప్రెస్ క్లబ్, పాత్రికేయుల కోసం గెస్ట్ హౌస్ కోసం రెండు క్వార్టర్స్ కేటాయించారన్నారు. 15 రోజుల్లో ఆ క్వార్టర్స్ స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ
కళాశాలలో స్నాతకోత్సవం



పట్టభద్రులకు పట్టా పంపిణీ చేస్తున్న
అనంతపురం జేఎన్‌టీయూ ప్రొ. ఎస్వీ సత్యనారాయణ

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేవీ సుబ్బారెడ్డి ఫార్మసి కళాశాలలో శనివారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతపురం జేఎన్‌టీయూ ప్రొ.ఎస్వీ సత్యనారాయణ, కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి విద్యార్థులకు డిగ్రీ పట్టాను అందజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ పట్టభద్రులు కావడానికి విద్యార్థులు ఎంతగానో శ్రమించి ఉంటారని, వారి తల్లిదండ్రుల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. ఫార్మసి కోర్సు పూర్తిచేసిన 125మంది పట్టభద్రులకు మెమెంటోలను, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతపురం జేఎన్‌టీయూ ప్రొఫెసర్స్ ఆర్.పద్మ, సువర్ణ కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ కేబీవీ రమణ, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పట్టభద్రులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

గూడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్యం పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కమిషనర్ రమేష్ బాబు అన్నారు. శనివారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జే.వెంకటేశ్వర్లు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీ పరిధిలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారన్నారు. తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నగరపంచాయతీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అపర చాణక్యుడు పీవీ నరసింహారావు



కాంగ్రెస్ కార్యాలయంలో పీవీ నరసింహారావుకు చిత్రపటానికి
నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అపర చాణక్యుడని మాజీ ఎమ్మెల్సీ, మాజీ డీసీసీ ఎం సుధాకర్ బాబు అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ నరసింహరావు 105వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలుగు ఖ్యాతి ఖండాంతరాలకు వ్యాపింప జేసిన ఎందరో మహనుభావుల్లో మన పీవీ ఎనలేని కీర్తి దక్కించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ ఖాద్రీ పాషా, జిల్లా మైనార్టీసెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు డా బి. బ్రతుకన్న, ఓబీసీ చైర్మన్ డీవీ. సాంబశివుడు, ప్రమీల, లాజరస్, రేపల్లే ప్రతాప్ తదిరులు పాల్గొన్నారు.

'జగన్‌ది దౌర్జన్యపూరిత ధోరణి'

కర్నూలు అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావం నుంచి జగన్మోహన్‌రెడ్డి తీరు దౌర్జన్యపూరితం, ధిక్కార ధోరణితో రాజకీయ వాతావరణ పూర్తిగా కలుషితమైందని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధరూర్ జేమ్స్ అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. జగన్ ఐదేళ్ల పాలన ఎలా ఉందో ప్రజలు ప్రత్యక్షంగా చూశారని, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని విమర్శించారు. పల్నాడు జిల్లా రెంటపాళ్లలో విగ్రహవిష్కరణ సందర్భంగా వేలాది మంది వైసీపీ కార్యకర్తలను సమీకరించి రోడ్ షో తోపులాటలో దళిత సామాజిక వర్గానికి చెందిన సింగయ్య అనే వృద్ధుడు జగన్ కారు కింద పడి చనిపోవడానికి జగన్మోహన్‌రెడ్డి కారణమని మండిపడ్డారు. ఆయనతో పాటు వైవీ సుబ్బారెడ్డి, అంబటి రాంబాబు, అంబటి మురళీ, విడుదల రజనీ, తదితరులే కారణమని వీరిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలకు అండగా ఉంటాం: మంత్రి టీజీ



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను బాధితులకు అందజేశారు. జి.రాజుకు రూ. 28 వేలు, ఎన్ గిరిజా బాయ్‌కు రూ. 55 వేలు, ఎస్ బాలయ్యకు రూ. 41,300, ఎం. లక్ష్మిదేవీకి రూ. 66,461, పి. రాజేష్ కుమార్‌కు రూ 35 వేలు, వి. సుబ్రమణ్యంకు రూ. 30,786, జీ. సునీల్ కుమార్‌రెడ్డికి రూ. 1,31,655 రేష్మా అంజుమ్‌కు రూ. 83,826, కాసెట్టి మాధవీకి రూ. 32, 255, చెక్కులను టీజీ భరత్ అందజేశారు. మొత్తం రూ.5,04,283ల చెక్కులను అందజేశారు. ఆపద సమయంలో కర్నూలు నియోజకవర్గ ప్రజలను ఆదుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన నేతకు ఆర్థిక సాయం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అస్వస్థతతో కర్నూలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసుకున్న కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రాంబాబును శనివారం మంత్రాలయం నియోజికవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి బి. లక్ష్మన్న కలిసి పరామర్శించారు. ఆరోగ్య విషయంలో ధైర్యంగా ఉండాలని చెప్పి, రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మన్నతోపాటు బీజేపీ రాష్ట్ర నాయకుడు జగ్గాపురం చిన్న ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



విద్యార్థులకు క్రీడా పరికరాలు
అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని దాని సాధనకై కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ సూచించారు. శనివారం దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ మెయిన్ పాఠశాల విద్యార్థులకు ఆయన క్రీడాపరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, జిల్లా విజిలెన్స్ ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటి సభ్యులు సురేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులు అడిగిన క్రీడా పరికరాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జోసెఫ్ లక్ష్మయ్య, దాసరి సుధీర్, పీఈటీ బాషా, హెచ్ఎం రాజేశ్వరరెడ్డి, హిందీ ఉపాధ్యాయుడు రఘురాం పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తులో యువతది కీలకపాత్ర



మాట్లాడుతున్న డా.బి. శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తులో కీలక పాత్ర యువతదేనని, యువత బాలలు ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ఉన్నప్పుడే ఆ దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ప్రముఖ సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ అన్నారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లాల రగ్బీ పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో మార్పులు తెచ్చుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, కొండేపోగు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

రేపు మాక్ పార్లమెంటరీ సమావేశం

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక దూపాడు దగ్గర ఉన్న సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు బీజేపీ ఆధ్వర్యంలో మాక్ పార్లమెంటరీ సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కంతోట రామకృష్ణ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా బీజేపీ ఇన్‌చార్జి అంకాల్ రెడ్డి, తెలంగాణ పార్లమెంటరీ సభ్యురాలు డీకే అరుణ, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మ లాకిషోర్ ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారన్నారు.

మైనారిటీ కాలనీ సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ చైర్ పర్సన్ లోకేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్

ఆదోని టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతంలోని మైనారిటీ కాలనీ, నిజాముద్దీన్ కాలనీలలో చాలాకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ సీహెచ్ లోకేశ్వరిని కోరారు. ఆయన మాట్లాడుతూ మైనారిటీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో మురుగు, మరుగుదొడ్లు శిథిలావస్థలకు చేరుకున్న కారణంగా ఈ ప్రాంత మహిళలు బహిర్భూమి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కొత్త సామూహిక మరుగుదొడ్లను నిర్మించాలని కోరారు. కాజీ గడ్డ, ఎన్‌టీఆర్ నగర్, నిజాముద్దీన్ కాలనీ ప్రాంతాలలో ఉన్న ప్రజలు కోసం మినీ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసి తాగునీటి ఇబ్బందులు తొలగించాల్సి ఉందని ఆయన కోరారు.

చిన్నారులకు స్వర్ణామృత ప్రాసనం

ఆదోని టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆవోపా ఆధ్వర్యంలో శనివారం చిన్నారులకు స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేశారు. కార్యక్రమ సౌజన్య కర్త కాకుబాల్ నాగేష్, సంస్థ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ త్రిదండి చిన్నజీయర్ స్వామి ఆశీస్సులతో వికాస తరంగిణి సహకారంతో 215 మంది చిన్నారులకు ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ మందును 13వ విడతగా పంపిణీ చేసినట్లు తెలిపారు. సభ్యులు శ్రీనాథ్ గుప్తా, రఘు, యతగిరి వెంకటేశ్వర్లు, కుప్ప రాజేష్, మహిళా విభాగం సభ్యులు వంకదారు మమతశ్రీ, అనిత, సంతోషి పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ ప్రైవేటు కళాశాల ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తోందని, ఈ ఫీజుల దోపిడీ అరికట్టి కళాశాలపై చర్యలు తీసుకోవాలని బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి సోమశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఆదోనిలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి ఏవో వసుంధరకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కళాశాలలో ఐఐటీ, జేఈఈ మెయిన్స్ నీట్‌కు శిక్షణ ఇస్తామని ఇంటర్ విద్యార్థుల తల్లిదండ్రులకు మాటలు చెప్పి పుస్తకాల పేరుతో అక్రమంగా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శివలోకేష్, మహేష్, సాయి, యోహాను, విజయ్, చంద్ర, సాగర్ పాల్గొన్నారు.

ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలి



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుర్తింపు లేకుండా నడుపుతున్న ఓ నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి అమర్ డిమాండ్ చేశారు. కర్నూలు వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిపాలన అధికారిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రూ. వేలకు వేలు ఫీజులు వసూలు చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ముందు దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కళాశాల భవనం యాజమానిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లేష్, ఆర్యన్, పృథ్వీ పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



చావిడిలో కొలువైన పీర్లు

మద్దికెర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం పీర్లు కొలువుదీరాయి. ఈ ఉత్సవాలు పది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కమిటీ పెద్దలు తెలిపారు. ఆరు రోజుల వరకు సరిగెత్తు నిర్వహించి, 7వ రోజు చిన్న సరిగెత్తు, 10వ రోజు పెద్ద సరిగెత్తు, 11వ రోజున పీర్లు ఏటికి వెళ్తాయన్నారు. ప్రధానంగా పెద్ద సరిగెత్తు రోజున అగ్నిగుండంలో చిందులు తొక్కుతారు. భక్తులు పీర్లచావిడిలో కొలువతీరిన పీర్లకు చక్కెరతో మొక్కులు తీర్చుకుంటారు. కులమతాలకు అతీతంగా మొహర్రం జరుపుకోవడం ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తుంది.

భక్తిశ్రద్ధలతో మొహర్రం జరుపుకోవాలి



మరకట్టు గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఆలూరు, జూన్28(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భాన్ని గ్రామాల్లో సోదర భావంతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా సూచించారు. మండలంలోని కమ్మరచేడు, మరకట్టు, హత్తిబెళగల్ గ్రామాల్లో శనివారం ప్రజలతో సమావేశమయ్యారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎలాంటి ఘర్షణలకు అవకాశం లేకుండా భక్తిశ్రద్ధలతో వేడుకలను జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆక్రమణల తొలగింపుపై ఎందుకీ నిర్లక్ష్యం?

- కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేపట్టకపోతే బ్లాక్ లిస్టులో పెట్టాలి
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల నిలదీత



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ లలితమ్మ



వార్డులో అభివృద్ధి పనులు చేయనప్పుడు తన రాజీనామా ఆమోదించాలంటున్న కౌన్సిలర్ బాలాజీ

ఆదోని అగ్రికల్చర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి నగర్‌లోని తన వార్డులో రోడ్డును ఆక్రమించుకొని దుకాణాలు వేసుకొని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తు ఆక్రమణల తొలగింపుపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని కౌన్సిలర్ వెల్లాల లలిత మధుసూదన్ శర్మ మున్సిపల్ అధికారులను నిలదీశారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ లోకేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మాజీ కౌన్సిలర్ గోవిందురాజులు మృతికి రెండు నిమిషాలు కౌన్సిలర్లు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. సమావేశం ప్రారంభమైన వెంటనే 29వ వార్డు కౌన్సిలర్ బాలాజీ గత నెలలుగా కంచిగారి వీధిలో వాటర్ పైపులైన్, డ్రైనేజీ, సీసీ రోడ్డు మంజూరైన పనిచేయకుండా ఇంజనీరింగ్ సెక్షన్ నిర్లక్ష్యం చేస్తున్నారని, పనులు ప్రారంభించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళినా పట్టించుకోలేకపోవడంతో తాను రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. ఇంతవరకు పనులు ప్రారంభించలేదన్నారు. తన రాజీనామాను అందరూ ఆమోదించాలని చేతులు జోడించి వేడుకుంటున్నానని బయటికి వెళ్లారు. కౌన్సిలర్లంతా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. కమిషనర్ కృష్ణ సమాధానం ఇస్తూ చాలా పనుల బిల్లులు చెల్లింపులో సాంకేతిక సమస్య ఉండటం వల్ల ఆలస్యం అవుతోందని, దీంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు ముందుకు రావడం లేదని సమాధానం ఇచ్చారు. కౌన్సిలర్ లలితమ్మ మాట్లాడుతూ రోడ్డుపై డబ్బాలు వేసుకొని ఆక్రమణలకు గురైనట్లు పలుమార్లు విన్నవించినా వారికి టౌన్ ప్లానింగ్ అధికారులు టాక్స్ వేయడమేమిటని ప్రశ్నించారు. తొలగించాలని చెబుతున్నా టాక్స్ ఎలా వేస్తారని నిలదీశారు. ప్రజా ప్రతినిధిగా తనకు చెప్పాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. మున్సిపల్ చట్టంలో మీకు చెప్పాలని ఎక్కడా లేదని, తాత్కాలికంగా కొన్నిటిని తొలగించి మరికొన్నింటికి మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందని టాక్స్ వేసినట్లు మున్సిపల్ టీపీవో బాలమద్దయ్య సమాధానం ఇచ్చారు. టీడీపీ కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ తన వార్డులో ఇంటిపైన విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని వర్షాకాలం రావడంతో ప్రమాదాలు జరగవచ్చని, వెంటనే తొలగించాలని కోరారు. కౌన్సిలర్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపిన పనులు జరగకపోవడం, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్ల తమను ప్రజలు నిలదీస్తున్నారన్నారు. దీనిపై కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఎక్కడ సమస్య ఉందో ప్రజలకు తెలియాలని అన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి మున్సిపల్ కౌన్సిలర్లే అభివృద్ధిని అడ్డగిస్తున్నట్లు చెప్పుకుంటున్నారని అయితే తాము ఎక్కడా కూడా అభివృద్ధికి ఆటంకం కలిగించలేదన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఎజెండాలోని కొన్నిఅంశాలను చదివి వినిపిస్తుండగా వైస్ చైర్మన్ నరసింహులు అన్నింటికీ ఆమోదం తెలుపుతూ ముందుకు వెళ్లాలంటూ సూచించారు. కౌన్సిలర్లు ఫయాజ్, శాంత హసీనా, అశోక్, చలపతి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : బీజేపీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పత్తికొండటౌన్, జూన్28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ గోవర్ధన్‌నాయుడు అన్నారు. శనివారం పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బీజేపీ బృందం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పిల్లలతో కలిసి బీజేపీ నాయకులు సహపంక్తి భోజనాన్ని చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయని, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పథకానికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామాంజినేయులు, మల్లికార్జున, భాస్కర్, నరసింహుడు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

హాలహర్వి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ఈరన్న ఆదేశించారు. మండలంలోని అర్థగేరి గ్రామంలో శనివారం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వంట ఏజెన్సీల్లో భోజనం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తొలగించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జింకల బెడదను అరికట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు బోయ మునిస్వామి

ఆలూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రాంతంలో జింకలు పంటలను నాశనం చేస్తున్నారని, వీటి బెడదను అరిట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు బోయ మునిస్వామికోరారు. శనివారం పెద్దహోతూరు గ్రామంలో ఆయన మాట్లాడుతూ ప్రతియేటా జింకలు రైతులు పండించిన పంటలు నాశనం చేసి నష్టం చేస్తున్నాయన్నారు. జింకల పార్కు నిర్మాణానికి దేవరగట్టు వద్ద 250 ఎకరాల భూమి సర్వే కూడా చేశారన్నారు. ప్రతిపాదన మరుగున పడిందన్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి జింకల పార్కు ఏర్పాటుకు నిధులు కేటాయించాల్నారు. కార్యక్రమంలో రైతులు వరదరాజులు, బోయ ఓబులేష్, శివ బండయ్య, శేఖర్, సూరి, వీరేష్, రాముడు పాల్గొన్నారు.

పాఠశాలలో బెంచీల చోరీ

చిప్పగిరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోరీ జరిగింది. 15 బెంచీలు అపహరణకు గురయ్యాయి. హెచ్ఎం లతీఫ్, సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాస్తవంగా 15 బెంచీలు స్కూల్ నుంచి ఎలా మాయం అయ్యాయన్నది అంతు చిక్కడం లేదు.

జూనియర్ కళాశాలలో కళాప్రాంగణం ఏర్పాటు



కళాప్రాంగణంలో అధ్యాపకులతో పూర్వవిద్యార్థులు

పత్తికొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్‌కళాశాలలో 1974-76లో చదువుకున్న పూర్వవిద్యార్థులు కళాప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. రూ2.5లక్షలతో నిర్మించిన కళాప్రాంగణాన్ని తమకు విద్యను బోధించిన విశ్రాంత అధ్యాపకుడు వెంకటేశ్వర్లతో శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నైమున్నిసాబేగం, సీనియర్ అధ్యాపకులు వీరేషప్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

పండ్ల తోటల సాగువైపు దృష్టి సారించాలి

తుగ్గలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైతులు పండ్ల తోటల సాగు వైపు దృష్టి సారించాలని ఏపీవో హేమసుందర్ అన్నారు. శనివారం మండలంలోని ఏపీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురుస్తున్నాయని, ప్రభుత్వం వందశాతం సబ్సిడీ కింద పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు.

అంధకారంలో కాలనీలు



అంధకారంలో కోయనగర్ ప్రధాన రహదారి

ఆలూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కాలనీలు అంధకారంలో ఉన్నాయి. నెలకు పైగా వీధి లైట్లు వెలగకపోయినా పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో రాత్రి సమయాల్లో ప్రజలు బయటకు వెళ్లాలంటే గుంతలు, విష సర్పాలు, కుక్కలతో భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ సిబ్బంది మాత్రం లైట్లు లేవని సమాధానం చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఆయా కాలనీవాసులు కోరారు.

మహాసభలను జయప్రదం చేయండి



ముత్తుకూరులో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆస్పరి, జూన్28(ఆంధ్రజ్యోతి): జూలై 28, 29వ తేదీల్లో చేపట్టే సీపీఐ 28వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి విరుపాక్షి, గురునాథ్ కోరారు. శనివారం మండలంలోని ముత్తుకూరు గ్రామంలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఆలూరు నియోజకవర్గం పశ్చిమ ప్రాంతం తీవ్ర కరువు, కాటకాలతో అల్లాడుతోందన్నారు. జిల్లాలో లక్షలాది కుటుంబాలు వలసల వెళ్లి జీవిస్తున్నారన్నారు. జిల్లాలో వేదావతి, గుండ్రేవుల రిజర్వాయర్, ఆర్డీఎస్ కుడి కాలువలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. రైతులకు సాగునీరు అందించాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయ, బడేసాబ్, రామలింగ, వెంకటేష్, భీరప్ప, రామాంజనేయులు, హనుమేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పెంపునకు ప్రతిపాదనలు



కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గుండాల్ నాయక్

మద్దికెర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో 1200మందికి పైగా ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపుతున్నట్లు తహసీల్దార్ గుండాల్ నాయక్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామాల్లో 34 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మద్దికెర గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, మద్దమ్మవ్వ దేవాలయం వద్ద గల ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ బూత్‌ల్లో 1200 మందికి పైగా ఓటర్లు ఉన్నారని, అదనంగా రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు అవుతాయన్నారు. వీఆర్వోలు గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రంగస్వామి ఉన్నారు.

నివాస ప్రాంతాల్లో రోడ్లు వేయాలి

పత్తికొండటౌన్, జూన్28(ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతాల్లో రోడ్లు వేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ బృందం మండల పరిషత్ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వి.కె.నగర్, దిద్దిసేను కాలనీ, జగ్జీవన్‌నగర్, పార్వతీకొండ కాలనీలు ఏర్పడి యేళ్లు గడుస్తున్నా మౌలిక సదుపాయాలైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి కొళాయిలు వేయడం లేదన్నారు. ఊరిబయట సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు విరుపాక్షి, కారుమంచి, జిల్లా సమితి సభ్యులు కారన్న, వీరన్న, నాయకులు కాశీ తదితరులు పాల్గొన్నారు.

రేపు రాంపల్లిలో రాతిదూలం పోటీల

తుగ్గలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాల్లో భాగంగా రాంపల్లె కొండపై సోమవారం రాతిదూలం పోటీలు నిర్వహించనున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు తెలిపారు. శనివారంఆయన మాట్లాడుతూ గెలుపొందిన వృషభాలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు దాతల సహకారంతో అందిస్తారన్నారు. వివరాల కోసం 9492735091, 8985127729 నెంబరులను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

క్రిష్ణగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలో అమకతాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పని చేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. శనివారం ఉపాధ్యాయులను మాజీ జడ్పీటీసీ కేఈ జయన్న ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అమకతాడు వీరభద్రుడు, వెంకటేశ్, సుధాకర్, ఎల్లరాజు, హనుమంతు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఫణిరాజు సూచించారు. శనివారం సాయంత్రం మెయిన్‌బజారులో సైబర్ నేరాలు, దొంగతనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డబ్బులు, బంగారం ఇళ్లలో దాచుకోకుండా బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు ఎక్కువగా ఉన్నందున సెల్‌కు వచ్చే మెసేజ్‌లు, ఓటీపీలు చెప్పమని అడిగితే చెప్పకూడదన్నారు. బ్యాంకులకు సంబంధించి ఓటీపీ నెంబర్లు బ్యాంకర్లు అడుగరన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాజన్న యాదవ్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడు, టీడీపీ నాయకులు గొడుగు సతీష్ కుమార్, మీసేవ భీమరాజు తదితరులున్నారు.

హాలహర్వి: సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మారుతి పిలుపునిచ్చారు. శనివారం హాలహర్విలో ఏర్పాటు చేసిన సైబర్ నేరాల నివారణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఆధార్, బ్యాంకు ఖాతా, ఓటీపీ నంబర్ వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని సూచించారు. గ్రామాల్లో జరిగే మొహర్రం వేడుకలకు తప్పకుండా అనుమతి తీసుకోవాలని, ప్రశాంతంగా పండగ జరుపుకోవాలని ఆయన సూచించారు.

రేషన్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పత్తికొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకు వెళ్లి సరఫరా చేసే రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నూర్‌అహ్మద్ హెచ్చరించారు. శనివారం పత్తికొండ పట్టణంలోని 4, 9 రేషన్‌దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు అందిస్తున్న రేషన్ వివరాలను పరిశీలించారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

క్రికెట్ అండర్-19 సౌత్‌జోన్‌కు ముబీనా ఎంపిక



పత్తికొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణానికి చెందిన ముబీనా అండర్-19 క్రికెట్‌లో సౌత్ జోన్‌టీంకు ఎంపికైంది. కర్నూలు క్రీడా అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన అంతర్‌జిల్లాల అండర్-19 క్రికెట్‌లో రాణించింది. రెండుమ్యాచుల్లో బ్యాటింగ్‌లో 76, 41 చేసి జట్టు గెలుపునకు కారణమైంది. దీంతో సౌత్‌జోన్ టీంకు ముబీనాను అసోసియేషన్ ఎంపికచేసింది. అలాగే అండర్-19 రాష్ట్ర టీంలో ఎంపిక కోసం ముబీనా పేరును ప్రతిపాదించారు.

పొలం వివాదంలో ఘర్షణ

దేవనకొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పొలం వాటాల విషయంలో సొంత అన్నదమ్ములే ఘర్షణ పడ్డారు. సీఐ వంశీనాథ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని బంటుపల్లి గ్రామానికి చెందిన నర్సన్నకు ముగ్గురు కుమారులు. ఆస్తుల పంపకంలో రెండోవ కుమారుడు ఈరన్న, మూడో కుమారుడు వీరాంజినేయులు మధ్య కొంత కాలంగా వివాదం జరుగుతోంది. శనివారం ఈరన్న పొలం పనులకు వెళ్తున్న క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాల వారికి తీవ్రగాయాలు కావడంతో, ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రశాంతంగా మొహర్రం జరుపుకోవాలి

తుగ్గలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొహర్రాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ గౌడ్ సూచించారు. శనివారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి తదితర గ్రామాల్లో సీఐ పర్యటించి గ్రామస్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. మొహర్రం వేడుకలు జరుపుకునే వారు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో కోలాటాలు ఆడటం, సావ్‌సేన్ ఆటలు ఆడకూడదన్నారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదు



మహిళలకు సూచనలు చేస్తున్న లక్ష్మీనాథ్

వెల్దుర్తి టౌన్, జూన్ 28 (ఆంధ్ర జ్యోతి): ఇంట్లోని చెత్తను ఆరుబయట వేయరాదని, ఇంటి వద్దకు వచ్చే చెత్త బండ్లలో వేయాలని వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్ అన్నారు. శనివారం పట్టణంలో చెత్త సేకరణను దగ్గరుండి ఆయన పరిశీలించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన బోగోలు రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. కల్లూరుకు చెందిన శివ అనే యువకుడు తిరుపతి నుంచి (12798) వెంకటాద్రి సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌లో కర్నూలుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో శుక్రవారం అర్ధరాత్రి బోగోలు రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

వెల్దుర్తి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి టీ రాజగోపాల్ శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు తయారుచేసిన ఆహారాన్ని పరిశీలించారు. అలాగే స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. సరుకుల వివరాలను ప్రిన్సిపాల్ షబానా బేగమ్‌ను అడిగి తెలుసుకున్నారు. శ్యాంపిల్స్ సేకరించారు. నాణ్యతా ప్రమాణాల కోసం గుంటూరు ల్యాబ్‌కు పంపిస్తామన్నారు.

సింగిల్ విండో చైర్మన్లుగా ఎన్నిక



ఆకుల ఆనంద్

మద్దికెర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడవలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీసీ నాయకుడు ఆకుల ఆనంద్‌ను మద్దికెర సింగిల్ విండో చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు శనివారం సహకార సంఘానికి ఉత్తర్వులు వచ్చాయి. ఎడవలి గ్రామానికి చెందిన ఆనంద్ ముప్పై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉంటూ పలు పదవులు చేపట్టి, కేఈ కుటుంబానికి విధేయుడుగా ఉంటూ వచ్చారు. బీసీ వర్గానికి చైర్మన్ పదవి ఇవ్వడంతో గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ తనను సింగిల్ విండో చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఉత్తమ సేవలు అందిస్తామని తెలిపారు.



రంగప్ప

పత్తికొండ: స్థానిక సింగిల్ విండ్ చైర్మన్‌గా చందోలి రంగప్ప ఎంపికయ్యారు. పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన రంగప్ప టీడీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా ఉంటున్నారు. రంగప్ప సేవలు గుర్తించిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సింగిల్‌విండో అధ్యక్ష పదవికి ఆయన పేరును పార్టీకి సిఫారస్ చేశారు. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. కాగా, సొసైటీ మెంబర్లుగా కె.సురేంద్ర, జగన్నాథ్ ఎన్నికయ్యారు.



ప్రభాకర్ రెడ్డి

తుగ్గలి: మండలంలోని మారెళ్ల సొసైటీ అధ్యక్షుడుగా వైబీ ప్రభాకర్ రెడ్డిని, డైరెక్టర్లుగా రాంపల్లికి చెందిన శ్రీనివాసులు, బొందిమడుగులకు చెందిన మోహన్‌ను, ఉప్పర్లపల్లి సొసైటీ అధ్యక్షుడిగా అప్పా వేణుగోపాల్, డైరెక్టర్లుగా దిగువచింతలకొండకు చెందిన చిన్న పెద్దయ్య, రాంపురానికి చెందిన భీమలింగప్ప చౌదరిలను ఎంపిక చేశారు. త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

రాకపోకలు బంద్

- ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన వంతెన
- ఏపీ, కర్ణాటక మధ్య నిలిచిన రాకపోకలు
- ఇబ్బందుల్లో సరిహద్దు గ్రామాల ప్రజలు


కూలిపోయిన వంతెన

కౌతాళం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుంబళనూరు-హల్వి గ్రామాల మధ్య ఉన్న వాగు వద్ద ఉన్న వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోవడంతో రెండు గ్రామాలతో పాటు ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల ప్రజల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా హల్వి- కుంబళనూరు రెండు గ్రామాల మధ్య ఆర్టీసీ సర్వీసులు కూడా నిలిచిపోవడంతో కుంబళనూరు గ్రామ ప్రజలు, విద్యార్థులు హల్వి గ్రామానికి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హల్వి నుంచి కర్ణాటకలోని సిరుగుప్పకు వెళ్ళేందుకు కూడా రవాణ సౌకర్యాలు నిలిచిపోయాయి. వంతెన దెబ్బతిని రెండు నెలలు కావస్తున్న సంబంధిత అధికారులు కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురైతున్నారు. కుంబళనూరు గ్రామాల రైతుల పొలాలు తమ వ్యవసాయ పనుల కోసం ఈ వంతెనను దాటుకుని వెళ్లాల్సి ఉండగా ఈవంతెనను దాటేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాలకు చేరాలంటే చుట్టూ 8కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. గత ఏడాది మరళి ఇసుకరీచ్‌ల నుంచి ఇసుక లారీలు ఈ వంతెన గుండా రావడంతో వంతెన దెబ్బతినగా అప్పట్లో రూ.2లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చిన్న చిన్న వాహనాలు మాత్రమే దీనిపై పోయేవి. ఇటీవల కురిసిన భారీ వర్షానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన వంతెన కూడా పూర్తిగా కొట్టుకుపోవడంతో దీనిపై శాశ్వత వంతెన చేపడితే తప్ప ఇక్కడ రాకపోకలు కొనసాగేలా లేవు. శాశ్వత వంతెనకు రూ.40లక్షలు కావాల్సి వస్తుందని ఈ వంతెన నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నివేదికలను పంపామని తెలుపగా అనుమతులు వస్తే తప్ప ఇక్కడ వంతెన నిర్మాణం చేపట్టలేమని అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం ఈ వంతెనపై రాకపోకలు నిలిచిపోవడంతో అత్యవసర పనుల కోసం ఇరువైపు గ్రామాల ప్రజలు వంక నుంచే ద్విచక్రవాహనాల ద్వార ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం కొనసాగిస్తున్నారు. రాకపోకలు నిలిచిపోవడంతో కొంత మంది విద్యార్థులు కూడా పాఠశాలలకు వెళ్ళడం మానివేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేసి రెండు గ్రామాలకు రాకపోకలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మహాసభకు తరలిరావాలి


సోమప్ప సర్కిల్‌లో కట్టిన సీపీఐ జెండాలు

ఎమ్మిగనూరు రూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం జరిగే 11వ తాలుకా మహాసభకు కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సీపీఐ మండల కార్యదర్శి రంగన్న పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయడమేగాక ప్రజలకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఉద్యమాలు చేస్తామన్నారు. నేడు జరిగే మహాసభకు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరవుతారన్నారు. ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలను చేశారు. ముఖ్యంగా బుడుములదొడ్డి, ఎరిగేరి పులిగట్టు, అగసలదిన్నె ఆంజనేయస్వామి దేవాలయాల్లో అర్చకులు తెల్లవారుజామునే మూలవిరాట్‌కు శుద్ధజలాలచే అభిషేకం నిర్వహించి ఫలపుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు చేశారు. స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు దర్శనానికి వచ్చిన భక్తులకు దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జనసేన కోడుమూరు ఇన్‌చార్జికి పరామర్శ


రాంబాబును పరామర్శిస్తున్న లక్ష్మన్న

మంత్రాలయం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనసేన కోడుమూరు ఇన్‌చార్జి రాంబాబును జనసేన మంత్రాలయం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, ఐక్యవాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి.లక్ష్మన్న శనివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ అవసరమైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం రూ.10వేల నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంచి ఆరోగ్యంగా బయటకు రావాలని ధైర్యం చెప్పారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జగ్గాపురం చిన్న ఈరన్న ఉన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి


బోయ అచ్చమ్మ (ఫైల్)

గోనెగండ్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బోయ అచ్చమ్మ(70) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. ఈమెకు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. అచ్చమ్మ మృతి చెందిన వార్తను తెలుసుకున్న పలు రాజకీయ పార్టీల నాయకులు అచ్చమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేముగోడు కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ మన్సూర్, భాస్కర్‌రెడ్డి, ఉల్చాల రంగన్ననాయుడు, గోవిందు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ


టీడీపీ నాయకులను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోనెగండ్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం అయిందని రాష్ట్ర నాయకులు ఆనంద్ చైతన్య, జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ అన్నారు. ఈ సందర్భంగా గ్రామ మేజర్ సర్పంచ్ టీడీపీ నాయకురాలు హైమావతి, టీడీపీ నాయకులు బేతాలబడేసా, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, తెలుగుయువత నాయకులు రంగస్వామినాయుడును పూల మాలలతో సన్మానించారు. రాఘవేంద్ర, వేముగోడు భాస్కర్, సంసోను, తిక్కయ్య, మత్తయ్య, మేకలన్న, నాయకులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


అమర్‌నాథ్

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 28 : పట్టణంలోని మూగతిపేటకు చెందిన ఎల్లూరి అమర్‌నాథ్ అదృశ్యం అయినట్లు భార్య ఎల్లూరి లాస్య పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అగరబత్తుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎల్లూరి అమర్‌నాథ్ ఈ నెల 16వ తేదిన వ్యాపారం నిమిత్తం ఉదయం 6గంటలకు మంత్రాయానికి కలెక్షన్‌కు వెళ్ళి తిరిగి రాలేదు అని భార్య లాస్య ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఎం, పీఈటీపై చర్యలు తీసుకోవాలి


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నందవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరంలోని జడ్పీ ఉన్నతపాఠశాల గోడలకు పెయింటింగ్ వేయించిన పాఠశాల హెచ్‌ఎం, పీఈటీలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఆర్‌ఎవీఎఫ్ నాయకులు మహేంద్ర, కృష్ణ, ఖాజాలు అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం మండల తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో చదువుకోవాల్సిన విద్యార్థులతో పాఠశాల ఆవరణంలో ముళ్లకంపలను తొలగించే పనులు చేయించటం, గోడలకు పెయింటింగ్ వెయించటం సరైంది కాదన్నారు. విద్యార్థులతో పనులు చేయించిన హెచ్‌ఎం, పీఈటీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు.

రేపు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న కమిషనర్

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని వివిధ అభివృద్ధి పనుల ఆమోదం కోసం సోమవారం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో గంగిరెడ్డి మాట్లాడుతూ సోమవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో వివిధ అభివృద్ధి పనుల ఆమోదం కొరకు కౌన్సిల్ సమావేశం జరుగుతుంది.కావున సంబంధిత అధికారులు,వార్డు కౌన్సిలర్లు అందరూ హజరు కావాలని కోరారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

కోసిగి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్‌డీలర్లు బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ ఏ.వేణుగోపాల్ అన్నారు. శనివారం కోసిగి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 1060 రేషన్‌కార్డుదారులు, వృద్ధులు దివ్యాంగులకు సంబంధించినవి ఉన్నాయనీ, ఇప్పటి వరకు 300 మంది వరకు కార్డుదారులకు పంపిణీ చేశారనీ, పెండింగ్‌లో ఉన్న మిగతా వారికి రేషన్ అందించాలని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు.

వైభవంగా చెక్క రథోత్సవం


చెక్క రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 28.(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం ఆషాడ తదియ శుభ దినంను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు, అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెక్క రథంను వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

భక్తులతో కిక్కిరిసిన శ్రీమఠం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీమఠం కిక్కిరిసింది. జూన్ ఆఖరి శని, ఆదివారం సెలవు రోజులు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొన్న మఠం అధికారులు క్యూలైన్లు, పరిమళ ప్రసాదం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శ్రీ మఠానికి రూ.లక్ష విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి కర్నాటకలోని బీదర్‌కు చెందిన ఆశీస్ దేశ్‌పాండే అనే భక్తుడు రూ.లక్ష దైనందిక సమర్పణ సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజరు ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో మఠం పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీపాధాచార్, అనంతపురాణిక్, జేపీ స్వామి పాల్గొన్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం

బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి



వినతి పత్రం ఇస్తున్న ఆర్‌ఎవీఎఫ్ నాయకులు

మంత్రాలయం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ముందు ఆర్‌ఎవీఎఫ్ నాయకులు బైఠాయించారు. శనివారం స్థానిక పాఠశాలల విద్యార్థులతో ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించారు. ఆర్‌ఎవీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖాజా, కృష్ణ మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గం అక్షరాస్యతలో వెనుకబడి ఉందని, బాలికల విద్య మరింత దారుణంగా ఉందని తెలిపారు. మంత్రాలయంలో బాలికల వసతి గృహాన్ని ఏర్పాటుచేస్తే బాలికలు ఉన్నత విద్యకు తోడ్పాటు అందుతుందన్నారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మోహన్, రాజేష్, శేషు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పట్టుపై సబ్సిడీ ఇవ్వాలి


మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం నాయకుడు భరణి కాలప్ప

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): చేనేత పట్టుపై సబ్సిడీ ఇవ్వాలని చేతి వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు గోవిందు, చేనేత కార్మిక సంఘం నాయకుడు భరణి కాలప్ప డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 250 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా ఇవ్వాలని ప్రతి చెనేత కార్మికుడికి 50శాతం సబ్సిడీతో రూ. 2లక్షలు బ్యాంకు రుణాలు ఇవ్వాలని చేనేత పట్టు సబ్సిడీ కింద కేంద్రం 50శాతం రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇవ్వాలని, ప్రతి చేనేత కుటుంబానికి 3 సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాముడు, శ్రీనివాసులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా బైకులు


సిద్ధప్పపాలెం మారెమ్మ దేవాలయానికి వెళ్లే దారిలో అడ్డంగా పెట్టిన బైకులు

కోసిగి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని సిద్దప్పపాలెం మారెమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డులో ఇరువైపులా బైకులు అడ్డంగా పెట్టడంతో ఆరోడ్డు మార్గాన ఎలా వెళ్లాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోడ్డు గుండా ఆర్‌ఎంపీలు, క్లీనిక్‌లు, పిండిగిర్ని ఉండటంతో పాటు రోడ్డు చిన్నగా ఉన్నగా కూడా ఇరువైపులా వాహనాలు నిలపుతుండటంతో రోడ్డు గుండా నడవడానికి కూడా వీల్లేకుండా ఉందని ఆ కాలనీవాసులు, కోసిగి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఆ వాహనాలు నిలపుతున్న వాహనదారులకు హెచ్చరికలు జారీచేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30వ తేదీన జరుగే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో 10 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఇందులో ఎన్నికయిన వారికి నెలకు రూ15వేల నుంచి 25వేల వరకు జీతం ఉంటుందని అన్నారు. జాబ్ మేళాకు హజరయ్యే నిరుద్యోగులు, యువతీ యువకులు తమ ధ్రువ పత్రాలు మరియు రెజ్యూమ్, ఏదైనా డిగ్రీ పాస్ అయ్యి 18-35 సంవత్సరాలు కలిగి ఉండాలన్నారు. ఇతర సమాచారం కోసం ఈ ఫోన్ నెంబర్ 8885904099 సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో సుధాకర్, ప్రిన్సిపాల్ మహబుబ్ బాషా పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ల నియామకం


ఎన్.రామకృష్ణారెడ్డి


రాఘమ్మ


అయ్యన్న


వెంకటపతిరాజు


గోపాల్

పెద్దకడబూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరులోని వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్‌గా మీసేవ ఆంజనేయులును నియమిస్తూ జిల్లా సహకార సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా ఎంజీ నరసన్న, బోయ రంగస్వామిని నియమించింది. చిన్నతుంబళం వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్‌గా కందనాతి నరసప్ప, సభ్యులుగా సంజీవయ్య, చంద్రశేఖర్‌ను నియమించింది. టీడీపి రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, టీడీపి మండల కన్వీనర్ ఈరన్న ఎన్నికైన చైర్మన్లతో శాలువాతో సన్మానించారు.

మంత్రాలయం: మంత్రాలయం కేడీసీసీ చైర్మన్‌గా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సోదరుడు ఎన్ రామకృష్ణా రెడ్డి, కల్లుదేవకుంట కేడీసీసీ చైర్‌పర్సన్‌గా వగరూరు గ్రామానికి చెందిన బోయ రాఘమ్మ పార్టీ అధిష్టానం నియమించింది. మంత్రాలయం సొసైటీ సభ్యులుగా దాసప్పగారి తిమ్మప్ప,బీ.నాగేష్, కల్లుదేవ కుంట సొసైటి సభ్యులుగా గొర్రెల భీమయ్య,ఆర్ లక్ష్మన్నలను నియమించినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి తెలిపారు.

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని సింగల్ విండో అధ్యక్షుడిగా రాజానగర్ క్యాంపున కు చెందిన అల్లూరి వెంకటపతిరాజు ఎంపికై నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కౌతాళం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారి అభివృద్ధికి పాటు పడుతానని తెలిపారు. అలాగే బదినేహల్ సహకారం సంఘం సొసైటీ అధ్యక్షుడిగా కుంటనహల్ మారెప్పను సభ్యులుగా సోమనాథ, నరసింహులును నియమించారు. వెంకటపతిరాజును కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో మండల టీడీపీ నాయకులు ఆయన స్వగృహంకు వెళ్ళి పూలమాల శాలువాలతో సన్మానించారు.

ఎమ్మిగనూరు : మండలకేంద్రమైన నందవరంలో ఉన్న ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులుగా నందవరం మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గాజుల గోపాల్‌ను నియమిస్తు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా నందవరం పీఏసీఎస్ కు గాజుల గోపాల్‌ను, సభ్యులుగా నాగలదిన్నెకు చెందిన తెలుగు మహేష్, నందవరంకు చెందిన దేవళ్ల భీమశేఖర్‌ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సూచనమేరకు నియమించింది. కాగా ఎమ్మిగనూరు సొసైటీకి, మండలపరిదిలోని కడిమెట్ల సొసైటీ, గోనెగండ్లలోని సొసైటీలకు త్రీమెన్ కమిటిని ప్రకటించకపోవటంతో ఆ పదవులు వస్తాయని ఆశించిన నాయకులు నిరుత్సాహానికి లోనయ్యారు. నందవరం సొసైటీ అధ్యక్షులుగా ఎంపికైన గాజుల గోపాల్‌ను మాచాపురం మాజీ సర్పంచ్, టీడీపీ నయకులు కాశీం వలి, సత్యరెడ్డి, నాగలదిన్నె రంగయ్య, సుధీర్‌లు ఘనంగా సన్మానించి అభినందించారు. తనను నందవరం సొసైటీ అధ్యక్షుగా ఎంపిక చేసిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డికి గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.


సన్మానిస్తున్న తెలుగు రైతు అధికార ప్రతినిధి

కోసిగి: కోసిగి మండల పరిధిలో ఉన్న ఆర్లబండ సహకార సంఘం చైర్మన్‌గా కోసిగి చెందిన నాడిగేని అయ్యన్న, డైరెక్టర్లుగా కందుకూరు గ్రామానికి చెందిన కురువ అయ్యన్న, జంపాపురం గ్రామానికి చెందిన చిదానందలను ఎన్నుకున్నట్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి తెలిపి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికైన వారు మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి రుణపడి ఉంటామని చైర్మన్ నాడిగేని అయ్యన్న తెలిపారు. అనంతరం ముత్తురెడ్డికి, పల్లెపాడు రామిరెడ్డికి, మంత్రాలయ టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డిలకు పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఆర్లబండ సహకార సంఘం ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్లకు పూలమాలలు వేసి శాలువలతో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సన్మానం చేశారు. టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, గవిగట్టు ఈరయ్య, నాడిగేని హనుమంతు, గుండాల ఈరయ్య, గుండేష్, లక్ష్మిరెడ్డి, తిమ్మయ్య, బసవరాజు, తదితరులు ఉన్నారు.